





'నేతి'బీర చందమే..



నెయ్యి ఘుమఘుమలు..
మనకు కొత్తకాదు..!
ముద్దపప్పు, ఆవకాయ..
నెయ్యి కలిపితే ఆహా అంటాం
వేడి వేడి పూర్ణంబూరె..
చిల్లుపెట్టి ఓ చుక్క నెయ్యి
తగిలిస్తే ఓహో అంటాం
ఇంకా...
నేతి పెసరట్టు ఉప్మా..
లేదంటే ఒట్టి నేతి ఉప్మా..
నేతి బొబ్బట్లు
పూతరేకులు
సున్నుండలు..
ఇలా..
ఏదైనా సరే,
నెయ్యి పడితేనే
బ్రహ్మాండం అంటాం
ఏ పూజా కార్యక్రమం జరిగినా
ఆవునెయ్యితోనే ఆరాధన
ఆలయాల్లోనూ దీపారాధన
నెయ్యితో చేసిన ప్రసాదమే
మనకు వర ప్రసాదం!
నెయ్యి మనోళ్లకు
ప్రీతిపాత్రం, పవిత్రం..
ఇంత ప్రాముఖ్యత కలిగిన
నెయ్యి నాణ్యతపై ఇప్పుడు చర్చ
జరుగుతోంది. అసలు నెయ్యిలో
నెయ్యి ఎంత? నిజమెంత?

ఆదివారం ప్రత్యేకం

(కాకినాడ -ఆంధ్రజ్యోతి)

- తిరుపతి ఘటనతో ఉమ్మడి జిల్లా ఆలయాల్లో నెయ్యి వాడకంపై ఎడతెగని చర్చ
- దేవస్థానాలకు సరఫరా అవుతోన్న నెయ్యి నాణ్యతపై సవాలక్ష సందేహాలు
- నెయ్యి దుమారం నేపథ్యంలో అన్ని ఆలయాల్లో నాణ్యతపై త్వరలో ప్రభుత్వం పరీక్షలు
- మరోపక్క ఏ ఆలయంలో చూసినా ప్రసాదాల్లో వాడే నెయ్యిపై భక్తులు తెగ ఆరా
- అటు గ్రామాలు, పట్టణాల్లోని దుకాణాల్లో విక్రయించే లూజు నెయ్యిపైనా కొత్తగా ఆరా
- సోషల్ మీడియా, ఇంటర్నెట్‌ల్లోనూ తాజాగా నెయ్యి ధరలపై జనం విపరీతంగా శోధన

ఈ నెయ్యి ఎక్కడి నుంచి వచ్చింది... ఎంతకు కొంటున్నారు.. దీంతో తయారుచేసే ప్రసాదం తింటే పర్వాలేదా.. ఇదీ ఇప్పుడు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఎక్కడ చూసినా జరిగే చర్చ. తిరుపతి లడ్డూలో వినియోగించే నెయ్యిలో చేప నూనె, జంతువుల కొవ్వు ఆనవాళ్లు నిర్ధారణ జరిగి తీవ్ర సంచలనం రేపుతోన్న నేపథ్యంలో జిల్లాలోని పలు ఆలయాల్లో వినియోగించే నెయ్యిపై జోరుగా చర్చ నడుస్తోంది. ఇప్పటికే అన్నవరం దేవస్థానంలో వాడే నెయ్యి గడచిన రెండేళ్లుగా ఒకే కాంట్రాక్టర్ సరఫరా చేయడం తీవ్ర దుమారం రేపుతోంది. అలాగే అంతర్వేది, వాడపల్లి.. పాదగయ తదితర ఆలయాల్లో ఇచ్చే ప్రసాదాల్లో వినియోగించే నెయ్యి నాణ్యతపై ఇప్పుడు అందరి దృష్టిపడింది. దేవుడి దీపారాధనకు వినియోగించే నెయ్యి, ప్రసాదాల్లో వాడే నెయ్యి అసలు ఎక్కడి నుంచి వస్తోంది? ఎంత ధరకు కొంటున్నారు? నాణ్యత అసలు పాటిస్తున్నారా? అనే చర్చ రెండ్రోజులుగా జరుగుతోంది. మరోపక్క తిరుపతి ఘటనతో ఉమ్మడి జిల్లాలో ఆలయాల్లో అధికారులు సైతం ఉలిక్కి పడుతున్నారు. ఇంతకాలం వాడుతున్న నెయ్యి నాణ్యతపై పెద్దగా దృష్టిసారించని అధికారులు తాజా పరిణామాలతో నెయ్యి సరఫరా కాంట్రాక్టర్లను పిలిచి మాట్లాడుతున్నారు. నెయ్యి ఎక్కడి నుంచి తెస్తున్నారు? నాణ్యత మంచిదేనా అంటూ ఆరా తీస్తున్నారు. కాగా అన్నవరం దేవస్థానానికి ప్రస్తుతం నెయ్యి సరఫరా చేస్తోన్న కాంట్రాక్టరు గడువు ఈనెలతో ముగుస్తోంది. వచ్చేనెల ఒకటి నుంచి మరో కొత్త కాంట్రాక్టరు వస్తున్నారు. దీంతో ఆ నెయ్యిపైనా ఇప్పటినుంచే అధికారులు దృష్టిసారించారు. కొత్త కాంట్రాక్టు కంపెనీ తిరుపతిది కావడంతో అక్కడ ఎక్కడ కొనుగోలు చేస్తున్నారో కొందరు ఆరా తీస్తున్నారు. మరోపక్క తిరుపతి ఘటన దేశవ్యాప్తంగా తీవ్ర దుమారం రేపుతుండడం, ఇదే సమయంలో ఇతర ఆలయాల్లో వినియోగించే నెయ్యి నాణ్యతపైనా కొత్తగా సందేహాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. అన్ని ఆలయాల నుంచి నెయ్యి శాంపిళ్లను త్వరలో పరీక్షించాలని నిర్ణయించింది. అన్నవరంతోపాటు ఇతర ఆలయాల నెయ్యి శాంపిళ్లను అధికారులు సేకరించబోతున్నారు. కాగా ఆలయాల్లో ప్రసాదాలు, దీపారాధనకు వినియోగించే నెయ్యి ఎలాంటిది? ఎక్కడి నుంచి వస్తుంది? ఎంతకు ఆలయ అధికారులు కొనుగోలు చేస్తారు? వంటి వివరాలు ఇంతకాలం అసలు ఎవరు పట్టించుకోలేదు. కానీ తిరుపతి ఘటన వెలుగులోకి వచ్చిన తర్వాత ప్రతి చోటా నెయ్యి నాణ్యతపైనే అంతా చర్చించుకుంటున్నారు. ఇదిలాఉంటే కాకినాడ, రాజమహేంద్రవరం, అమలాపురంతోపాటు అనేక పట్టణాల్లో స్థానిక డెయిరీలు, ఇతర ప్రైవేటు వ్యాపారులు నెయ్యిని ప్యాకెట్లతోపాటు లూజుగాను విక్రయిస్తుంటారు. తాజా ఘటన నేపథ్యంలో ప్రజలు నెయ్యి నాణ్యతను ఆరా తీస్తూ జాగ్రత్త పడుతుండడం విశేషం. అటు సోషల్ మీడియాలోను ఇదే విషయం హాట్‌టాపిక్‌గా మారింది. అనేకమంది ఇంటర్నెట్‌లో నెయ్యి నాణ్యత తెలుసుకోవడం ఎలా? నాణ్యమైన నెయ్యి ఎలా తయారవుతుంది? వీటి ధర ఎంత? నికార్సయిన నెయ్యి కిలో ఎంత అంటూ తెగ శోధిస్తుండడం విశేషం. అలాగే స్వీట్‌స్టాళ్లలోనూ నెయ్యి వినియోగంపై వినియోగదారుల ఆరా కూడా పెరిగింది.

అయ్యో.. నెయ్యి!

- స్వచ్ఛత నై.. వెన్నతో పని లేకుండా వంటనూనె, డాల్డాతో తయారీ
- తరిగిన పాడి.. పెరిగిన వాడకం
- స్వచ్ఛత నిర్ధారించడం కష్టమే

పప్పు ఆవకాయ అన్నంలో జుర్రున నెయ్యి పోసేసుకుంటున్నారా? పూర్ణం బూరె నిండా నెయ్యి వేసుకొని లొట్టలేస్తున్నారా? నేతి స్వీట్లను గుటుక్కుమని పిస్తున్నారా?.. ఇది మీ కోసమే. నెయ్యిని వివిధ రకాలుగా కల్తీ చేస్తున్నారు. నెయ్యిలో స్వచ్ఛతను పొయ్యి కూడా కనిపెట్టలేక పోతోంది. ఇవాళ పాడి బాగా తగ్గింది. కానీ మార్కెట్లో టన్నుల కొద్దీ నెయ్యి అందుబాటులో ఉంటోంది. అసలు వెన్న లేకుండా నెయ్యి తయారు చేయడమే ఈ దారుణంలో మతలబు మరి..!

(రాజమహేంద్రవరం -ఆంధ్రజ్యోతి)

నెయ్యిని రకరకాల పద్ధతిలో కల్తీ చేస్తున్నారు. నెయ్యి తయారీలో ప్రధాన ముడిసరుకు అయిన వెన్న లేకుండా కూడా నెయ్యిని తయారుచేసేస్తున్నారు. నెయ్యి తయారీ పరిశ్రమకోసం ఫుడ్‌సేఫ్టీ అండ్ స్టాండర్స్ అథారిటీ ఆఫ్ ఇండియా అనుమతి తప్పనిసరిగా ఉండాలి. రాష్ట్ర ప్రభుత్వ అనుమతులు కూడా కచ్చితంగా తీసుకోవాలి. సింథటిక్ ఫుడ్ కలర్స్, ఎసెన్స్‌ని అస్సలు కలపకూడదు. కల్తీ చేస్తే ఏకంగా రూ.5 లక్షల వరకూ జరిమానా విధించే అవకాశం ఉంది. కానీ ఇవేమీ అక్రమ వ్యాపారులను ఏమీ చేయలేకపోతున్నాయి. గ్రామాల్లో ఇళ్లను అద్దెకు తీసుకొని నెయ్యిని తయారు చేసేస్తున్నారు. వెన్న అవసరమే లేకుండా నెయ్యి తయారైపోతోంది. కోలమూరులో ఓ తయారీ కేంద్రాన్ని ఐదు నెలల కిందట ఫుడ్ సేఫ్టీ, విజిలెన్స్ అధికారులు సీజ్ చేశారు. ఇక్కడ నూనెతో నెయ్యిని తయారు చేస్తున్నారు. వంట నూనెను వేడి చేసి దానికి డాల్డాను జోడించి నెయ్యి వాసన రావడం కోసం ఫ్లేవర్‌ని కలుపుతున్నారు. అంతేకాకుండా గేదె నెయ్యికంటే ఆవునెయ్యి రేటు ఎక్కువ. కొవ్వు తక్కువగా ఉంటుందనే కారణంతో కూడా ఆవునెయ్యి వాడకం ఇటీవల ఎక్కువైంది. పూజల్లోనూ ఆవునెయ్యినే వాడతారు. గేదెనెయ్యి కాస్త తెల్లగా, ఆవునెయ్యి లేత గోధుమ రంగులో ఉంటుంది. అసలే కల్తీగా తయారుచేస్తున్న గేదె నెయ్యిలో గోధుమరంగు సింథటిక్‌కలర్‌ని జోడిస్తున్నారు.

ఎలా కనిపెట్టాలి...

నెయ్యి స్వచ్ఛతను కనిపెట్టడం అంత సులభం కాదు. నెయ్యి నమూనాలను నాచారం (హైదరాబాద్)లోని ఫుడ్ ల్యాబొరేటరీకి పంపించాల్సి ఉంటుంది. నెయ్యి పెద్దఎత్తున ప్రజలు వినియోగిస్తున్నా కల్తీని ప్రాథమికంగా నిర్ధారించే పరికరాలు కూడా జిల్లా ఫుడ్ కంట్రోల్ అధికారుల వద్ద లేవు. అయితే ఇంట్లో కొద్ది వరకూ తెలుసుకునే వీలుంది. దేశీ నెయ్యికి కొన్ని చుక్కల అయోడిన్ ద్రావణం కలిపి కొంత సమయం తర్వాత గమనించాలి. రంగు మారితే కల్తీ నెయ్యి కావచ్చు. గ్లాసు గోరు వెచ్చని నీటిలో నెయ్యి వేసి చెంచాతో బాగా కలపాలి. అది కల్తీ నెయ్యి అయితే నీటితో త్వరగా కరగదు. స్వచ్ఛమైనది అయితే నీటిలో కరిగి జిడ్డులా పైకి తేలుతుంది. నెయ్యిని ఎక్కువ ఉష్ణోగ్రత వద్ద కాచినపుడు కాలిన వాసన రాకూడదు. నెయ్యిలో డబ్బాలో వేసి ఫ్రిజ్‌లో పెడితే కాసేపటికి గాలి బుడగలు ఏర్పడినా, నూనెలా తేలినా కల్తీ జరిగినట్టే. స్వచ్ఛమైన నెయ్యిని అరచేతిపై వేస్తే అది జారకుండా కొన్ని క్షణాల తర్వాత కరగడం ప్రారంభిస్తుంది. కల్తీ చేసిన నెయ్యి బాగా జిడ్డుగా, రంగులో కూడా తేడా ఉంటుంది. స్వచ్ఛమైన నెయ్యి లేత పసుపు రంగులో ఉండి సూక్ష్మ పూసలుగా ఉంటుంది. నెయ్యి తయారీ కేంద్రాలు, హోటళ్లు, స్వీట్‌షాపులపై ముమ్మర తనిఖీలు చేస్తామని తూర్పుగోదావరి జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి రుక్కయ్య తెలియజేశారు.



నెయ్యి కిలో రూ.300 నుంచి రూ.4,600 దాకా..

గేదెపాలలో 6 నుంచి 10 శాతం వెన్న శాతం (ఫ్యాట్) వస్తుంది. కిలో నెయ్యి తయారుకావాలంటే 10 నుంచి 15 లీటర్ల పాలు కాచి, తోడుపెట్టి, పెరుగు నుంచి చిలికి వెన్నతీసి తద్వారా నెయ్యి వస్తుంది. ధర రూ.వెయ్యి వరకు పలుకుతుంది. అలానే ఆవునెయ్యిలో 3 నుంచి 4.5 శాతం వెన్నశాతం (ఫ్యాట్) వస్తుంది. కిలో ఆవునెయ్యి తయారు కావాలంటే 35 నుంచి 40 లీటర్ల పాలు కాచి, తోడుపెట్టి, పెరుగు నుంచి కవ్వంతో చిలికి వెన్న తీసి తద్వారా నెయ్యి వస్తుంది. ప్రస్తుతం అత్యంత స్వచ్ఛమైన ఆవునెయ్యి రూ.4,600 ధర ఉందని కడియం మండలం మురమండ గ్రామానికి చెందిన పాడిరైతు మరిడి సత్యనారాయణ చెప్పారు. కానీ కొందరు రైతులు రూ.800 నుంచి రూ.1500 మధ్య విక్రయిస్తున్నారు. మార్కెట్‌లో ఆవునెయ్యి రూ.300 నుంచి రూ.3 వేల వరకు లభిస్తోంది. డాల్డాలో కొద్దిపాటి నెయ్యి, పసుపు కలిపి ఆవునెయ్యి రంగు వచ్చేటట్టు, అలానే ఎస్సెన్సు కలిపి ఆవు నెయ్యి వాసన వచ్చేట్టు చేసి విక్రయిస్తున్నారు. - **కడియం/ప్రత్తిపాడు/జగ్గంపేట**



దీపాలు వెలిగించే నెయ్యి కల్తీనే..

దేవుని వద్ద ఉంచే దీపంలో ఆవునెయ్యి వేసి వెలిగిస్తే పుణ్యం దక్కుతుందని భక్తుల నమ్మకం. అదే నమ్మకాన్ని పెట్టుబడిగా చేసుకుని అందులో కల్తీకి పాల్పడుతూ కోట్లు గడిస్తున్నారు కొందరు అక్రమార్కులు. పశువుల కొవ్వులో కొన్ని రసాయనాలు కలిపి అచ్చమైన ఆవు నెయ్యిగా తయారు చేస్తున్నారు. పిఠాపురం పట్టణంలోని రెండు ప్రాంతాలతోపాటు గొల్లప్రోలు మండలం దుర్గాడ, శంఖవరం మండలం కత్తిపూడి తదితర ప్రాంతాల్లో వీటి తయారీ అధికంగా ఉంది. కార్తీకమాసంతో పాటు శ్రావణమాసం, ఇతర ముఖ్య పర్వదినాలు, వివిధ దేవుళ్ల మాలల సమయంలో ఆవునెయ్యితో తయారుచేసిన వత్తులు, దీపం వెలిగించేందుకు ఆవునెయ్యిని వినియోగిస్తారు. ఈ డిమాండుతో కల్తీ నెయ్యితో కలిపి తయారుచేసిన వత్తులను, కల్తీ నెయ్యిను అందమైన ప్యాకింగ్ చేసి ఆవునెయ్యిగా విక్రయాలు జరుపుతున్నారు. కొందరు అక్రమార్కులు వీటికి ప్రముఖ బ్రాండ్ల స్టిక్కర్లు అంటిస్తున్నారు. గతంలో పిఠాపురం పట్టణంలో నాలుగుసార్లు, గొల్లప్రోలు మండలం దుర్గాడలో రెండుసార్లు భారీగా కల్తీనెయ్యిని రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ల్యాబ్‌కు శాంపిల్స్‌ను మార్చి వేసి కేసుల నుంచి తప్పించుకున్నట్టు ప్రచారం జరిగింది. ఆలయాల వద్ద కల్తీ నెయ్యి దీపాల విక్రయాలే సాగుతున్నాయి. - **పిఠాపురం**



వాడపల్లిలో హెరిటేజ్ నెయ్యి

కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో లడ్డూ ప్రసాదం గత కొన్నేళ్ల నుంచి హెరిటేజ్ బ్రాండ్ నెయ్యినే వాడుతున్నారు. 2017 నుంచి ప్రారంభమైన స్వామివారి లడ్డూ తయారీ విక్రయాలు హెరిటేజ్ బ్రాండ్ నెయ్యితో తయారుచేస్తున్నారు. రావులపాలెంకు చెందిన హెరిటెజ్ డీలర్లు టెండర్ ద్వారా ఈ నెయ్యిని సమకూరుస్తున్నారు. ప్రస్తుతం హెరిటెజ్ కిలో నెయ్యి రూ.628కు టెండర్‌దారుడు అందిస్తున్నారు. నెలకు 2వేల కిలోల నెయ్యి అవసరంకాగా 1.70 లక్షల లడ్డూలు తయారవుతున్నాయి. లడ్డూ రూ.15కి భక్తులకు విక్రయిస్తున్నారు. - **ఆత్రేయపురం**



పూతరేకు, స్వీట్లలోనూ కల్తీ నెయ్యి

ఆత్రేయపురం పూతరేకులంటే ఎంతో ప్రసిద్ధి. కొందరు కాసులకు కక్కుర్తిపడి కల్తీ నెయ్యి వాడేస్తున్నారు. కల్తీనెయ్యి వీరికి కిలో రూ.200కు, రూ.300కు కూడా దొరుకుతోంది. బ్రాండ్ నెయ్యి రూ.700 నుంచి రూ.900. అలాగే ఘీస్వీట్ల తయారీలో వాడే నెయ్యిలోనూ జోరుగా కల్తీ జరుగుతోందని తెలుస్తోంది.



మిషన్ నుంచి పచ్చి పాలతో వెన్న తీస్తున్న దృశ్యం

నెయ్యి ఎన్ని రకాలు.. ఎలా తయారు చేస్తారు..

గేదె లేదా ఆవు పాలు కాచి, తోడుపెట్టి, పెరుగు నుంచి మీగడ చిలికి.. వెన్నతీసి.. దాన్ని కాచి నెయ్యి తీస్తారు. కవ్వంతో చిలికిన వెన్నతోనే పూర్వం నెయ్యి తయారు చేసేవారు. నెయ్యి కాస్తుంటే ఆ ప్రాంతమంతా మంచి సువాసనతో ఘుమఘుమలాడేది.

తర్వాత పచ్చిపాల నుంచి క్రీమ్ తీసి అది వెన్నగా మార్చి నెయ్యి చేసేవారు. గేదెపాల నుంచి లీటరుకు 70 గ్రాములు, ఆవుపాలు 80 గ్రాములు వెన్న తీసి దాన్ని నెయ్యిగా చేసి వివిధ పేర్లతో మార్కెట్‌లో నెయ్యి సప్లయి చేసేవారు. అది నాణ్యతగానే ఉండేది.

కొన్ని చిన్న చిన్న నెయ్యి తయారీ కేంద్రాల వారు ప్రముఖ పాల ఉత్పత్తుల కంపెనీల నుంచి బటర్‌ను కొనుగోలు చేసి నెయ్యి చేస్తారు. లేదంటే నేరుగా నాణ్యత కలిగిన పాలను సేకరించి బటర్ తయారు చేసుకుని దాన్నించి నెయ్యి తయారుచేస్తారు. - **గండేపల్లి/సామర్లకోట**

పశువుల కొవ్వుతో ఇలా..

రాజమహేంద్రవరం, తణుకు, నిడదవోలు ప్రాంతాలకు చెందిన వ్యాపారులు పశుమాంసం కొవ్వుకు వివిధ రసాయనాలు జోడించి పామాయిల్‌తో మిక్సింగ్ చేసి విక్రయిస్తున్నారు. ఈ నెయ్యి వల్ల గుండె సంబంధిత వ్యాధులు, కిడ్నీ సమస్యలు, కొలెస్ట్రాల్ పెరగడం, నరాల బలహీనత వంటి వ్యాధులకు లోనవుతున్నారు.

బదిలీల సందడి

(రాజమహేంద్రవరం -ఆంధ్రజ్యోతి)

రేపటితో ప్రక్రియ పూర్తి.. ఇప్పటికే కొలిక్కి..

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత బదిలీల సందడి మొదలైన సంగతి తెలిసిందే. మొదట్లో జిల్లా కలెక్టరు, ఎస్పీ, జేసీ, మున్సిపల్ కమిషనర్లు, తహశీల్దార్లు, అడిషనల్ ఎస్పీలు, డీఎస్పీలు, సీఐల బదిలీలు జరిగిన సంగతి తెలిసిందే. జిల్లాలో ఐదేళ్ల సర్వీసు పూర్తిచేసుకున్న వారందరికీ బదిలీలు ఉన్నాయి. అవికాకుండా పరిపాలనపరమైన అవసరాల కోసం, అనారోగ్యం, భార్యాభర్తలు ఉద్యోగులు వంటి ప్రత్యేక పరిస్థితుల్లో కూడా బదిలీలు జరుగుతున్నాయి. ఇంతకుముందే బదిలీల ప్రక్రియ పూర్తికావలసిఉంది. కానీ విజయవాడలో వరదలతోపాటు, అన్ని జిల్లాల్లోనూ వానలు, వరదలు ముంచెత్తడంతో ఈ ప్రక్రియను ఈనెల 23వ తేదీ వరకూ పెంచారు. దీంతో ప్రస్తుతం అన్ని ప్రభుత్వ కార్యాలయాలలోనూ ఇదే సందడి నెలకొంది. జిల్లాలో అన్ని ఇంజనీరింగ్ విభాగాల్లోనూ, కమర్షియల్ ట్యాక్స్, రెవెన్యూ, వార్డు- గ్రామ సచివాలయాలు, పంచాయతీలు, మున్సిపాల్టీలు, ఇరిగేషన్‌శాఖల పరిధిలో ఈ బదిలీలు జరగనున్నాయి. ఎక్సైజ్‌లో ఈనెలాఖరు వరకూ అవకాశం ఉంది. ఒక వైద్య శాఖ తప్ప అన్ని విభాగాల్లోనూ బదిలీలు జరుగుతున్నాయి. ఇప్పటికే జాబితాలు సిద్ధమయ్యాయి. రేపోమాపో ఆర్డర్లు రానున్నాయి. ఐదేళ్ల పూర్తయిన ఉద్యోగులు తమకు ఇష్టమైన ప్రాంతాలకు వెళ్లడానికి ప్రయత్నిస్తున్నారు. దీంతో ఎమ్మెల్యేలు, ఎంపీల సిఫార్స్ లెటర్లు కూడా తీసుకుంటున్నారు. కొన్ని విభాగాల్లో పోస్టును బట్టి డబ్బుతో పనిచేస్తున్నట్టు గుసగుసలు వినిపిస్తున్నాయి. కొన్నిచోట్ల సాధారణ బదిలీలే జరుగుతున్నాయి. గతంలో పోలీసులు, తహశీల్దార్ల పోస్టుల్లో డబ్బులు ప్రభావం చూపినట్టు ప్రచారం జరిగిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఇంజనీరింగ్ విభాగాల్లో కూడా ఈ పరిస్థితి చోటుచేసుకుంది. కానీ ఐదేళ్ల పూర్తయినా మంచి అధికారులు, చక్కగా పనిచేయించే వారిని కొంత కాలం ఉంచాలనే ఆలోచన కూడా ప్రజాప్రతినిధులు చేయడం గమనార్హం. కానీ ప్రభుత్వం ఐదేళ్ల పూర్తయిన వారిని కచ్చితంగా బదిలీ చేయాలనే ఆలోచనతో ఉండడం వల్ల ప్రజాప్రతినిధుల పట్టు కూడా పనిచేయడంలేదు. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్‌కు సంబంధించి రాజమహేంద్రవరం రీజినల్ డైరెక్టర్ కార్యాలయం పరిధిలో జూనియర్ అసిస్టెంట్లు, సీనియర్ అసిస్టెంట్లు, ఇతర ఉద్యోగులు మొత్తం 82 మంది వరకూ బదిలీ కానున్నారు. కొన్ని పెరిగినా పెరగవచ్చు. అనారోగ్యం తదితర కారణాలతో ఇంకా ఎవరైనా రిక్వెస్టులు పెట్టుకున్నా వారినీ బదిలీ చేసే అవకాశం ఉంది. కానీ దీనికి ఇక ఒక్కరోజే మిగిలి ఉంది. ఆదివారం సెలవు. ఇక సోమవారం ఉదయం ఆర్డర్లు ఇచ్చే అవకాశం ఉంది. కమర్షియల్ ట్యాక్స్ (జీఎస్‌టీ) కార్యాలయాలకు సంబంధించి కాకినాడ నోడల్ డివిజన్ పరిధిలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్లు, సీనియర్ అసిస్టెంట్లు మొత్తం 50 మంది బదిలీ అయ్యారు. ఎగ్జిక్యూటివ్ టాక్స్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు 16 మంది, గూడ్స్ అండ్ సర్వీసు ట్యాక్స్ (జీఎస్‌టీ) అధికారులు 25 మంది బదిలీ అయ్యారు. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు కూడా కొంతమంది బదిలీకానున్నారు. వీరి బదిలీలు ఉమ్మడి జిల్లాల పరిధిలో జరుగుతున్నాయి. ఇక ఒక్కరోజు మాత్రమే అవకాశం ఉన్నప్పటికీ ఎవరి ప్రయత్నాలు వారు చేస్తున్నారు. సోమవారం నాటికి మొత్తం బదిలీల ప్రక్రియ పూర్తవుతుంది. ఎక్సైజ్‌శాఖకు ఈనెలాఖరు వరకూ గడువు ఉంది.

నేడు కార్యదర్శులకు కౌన్సెలింగ్

రాజమహేంద్రవరం పరిధి బొమ్మూరులోని కలెక్టరేట్‌లో బదిలీలకు సంబంధించి పంచాయతీ కార్యదర్శులకు ఆదివారం కౌన్సెలింగ్ జరుగనుంది. రాజమహేంద్రవరం డివిజన్‌లోని కార్యదర్శులకు ఉదయం 10.30 గంటలకు, కొవ్వూరు డివిజన్‌లోని కార్యదర్శులకు మధ్యాహ్నం 2.30కు కౌన్సెలింగ్ నిర్వహిస్తామని డీపీవో రాంబాబు తెలిపారు.



డీఎంహెచ్‌వో ఆఫీసు వద్ద ధర్నా చేస్తున్న వైద్యులు

డీఎంహెచ్‌వో కార్యాలయం వద్ద పీహెచ్‌సీ వైద్యుల ధర్నా

రాజమహేంద్రవరం రూరల్, సెప్టెంబరు21: తమ న్యాయమైన డిమాండ్లను నేరవేర్చాలని కోరుతూ పీహెచ్‌సీ వైద్యులు శనివారం బొమ్మూరులోని డీఎంహెచ్‌వో కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ వైద్యులు సంఘం అధ్యక్షురాలు డాక్టర్ మౌనిక, కార్యదర్శి డాక్టర్ వినూత్న, కోశాధికారి డాక్టర్ ధర్మరాజు మాట్లాడారు. వైద్యులకు పీజీ కోర్సుల్లో ఇన్‌సర్వీస్ కోటాసీట్లు తగ్గించడాన్ని నిరసిస్తూ నిరసన చేపట్టినట్టు తెలిపారు. జీవోనెంబరు 85ను రద్దుచేసేవరకు ఆందోళన కొనసాగుతుందన్నారు. ఇన్‌సర్వీస్ కోటా కుదింపుతో జిల్లాలో 108 మంది వైద్యులు, రాష్ట్రవ్యాప్తంగా 2,560 మంది వైద్యులు నష్టపోతున్నారని చెప్పారు. ఈనెల 23న నుంచి విజయవాడలోనే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. అనంతరం డిప్యూటీ డీఎం అండ్‌హెచ్‌వో డాక్టర్ ఎస్.సంధ్యకు వినతిపత్రం అందించారు. యూనియన్ సభ్యులు ఏవీకే చైతన్య, సిరాజుద్దీన్, హరిశ్చంద్ర, షమ్మీ పాల్గొన్నారు.

3 నుంచి దేవీచౌక్ శరన్నవరాత్రి మహోత్సవాలు

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 21: రాజమహేంద్రవరం దేవీచౌక్‌లోని బాలత్రిపుర సుందరీదేవి శరన్నవరాత్రి మహోత్సవాలు వచ్చేనెల 3 నుంచి 13వ తేదీవరకు ఘనంగా నిర్వహిస్తున్నట్టు శ్రీదేవి మహోత్సవ సమితి అధ్యక్షుడు బత్తుల రాజరాజేశ్వరరావు తెలిపారు. శనివారం దేవిచౌక్ కల్యాణ మండపంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈఏడాది 91వ నవరాత్రి మహోత్సవాలు నిర్వహించడానికి చురుగ్గా ఏర్పాట్లుచేస్తున్నామన్నారు. 2న రాత్రి 9:09 గంటలకు దేవి విగ్రహప్రతిష్ట చేస్తామని 3న ఉదయం 8:40 గంటలకు కలశస్థాపన చేస్తామన్నారు. ప్రతిరోజు కుంకుమ పూజలు, ఉదయం మంగళ వాయిద్యాల నడుమ అఖండ హారతి కార్యక్రమాలు ఉంటాయన్నారు. 6న ఆదివారం 108 మంది దంపతుల పూజ, 9న మూలానక్షత్రం సందర్భంగా సరస్వతి పూజలు ఉంటాయన్నారు. రోజుకొక అలంకరణలో అమ్మవారు దర్శనమిస్తారన్నారు. 3వ తేదీ నుంచి ప్రతిరోజూ రాత్రి నాటక ప్రదర్శనలు ఉంటాయన్నారు.



పోస్టర్‌ను విడుదల చేస్తున్న బత్తుల, ఉత్సవ సమితి సభ్యులు

20న అన్నదానం ఉంటుందన్నారు. అనంతరం కార్యక్రమాలకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సమితి ఉపాధ్యక్షుడు ముత్యాల కుమారరెడ్డి, గంధం భైరవస్వామి, ఆకుల వెంకటేశ్వరరావు, సెక్రటరీ అల్లక సత్యనారాయణ, కోశాధికారి బత్తుల ఈశ్వరరావు, సహాయ కార్యదర్శులు పిల్లా వెంకటేశ్వరరావు, పిల్లి వెంకటరమేష్ పాల్గొన్నారు.



ఏకగ్రీవం చేసి ఐక్యతను చాటుతున్న ఎమ్మెల్యే శ్రీనివాస్

చాంబర్ అధ్యక్షుడిగా తవ్వా రాజా

ఏకగ్రీవం చేసిన ఎమ్మెల్యే ఆదిరెడ్డి

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 21: రాజమహేంద్రవరంలో ప్రతిష్టాత్మకంగా జరిగే ది రాజమండ్రి చాంబర్ ఆఫ్ కామర్స్ ఎన్నికలను ఈసారి ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ వ్యూహరచనచేసి ఏకగ్రీవం చేశారు. జాంపేట కోఆపరేటివ్ బ్యాంక్ ఎన్నికలను సైతం ఇటీవల ఏకగ్రీవం చేసిన ఆదిరెడ్డి ఇప్పుడు చాంబర్ ఎన్నికలను కూడా ఏకగ్రీవం అయ్యేలా చూశారు. చాంబర్‌కు జరిగే ఎన్నికల్లో పోటీలో ఉన్న అభ్యర్థులకు పోలింగ్ ఈనెల 30న జరగాల్సివుండగా కూటమి నాయకులతో ఏర్పాటు చేసిన తవ్వా రాజా ప్యానల్‌ను ఏకగ్రీవం చేయడంలో అందరినీ ఒకేతాటిపైకి తెచ్చారు. దీంతో కూటమి ప్యానల్‌లో తవ్వా రాజా చాంబర్ అధ్యక్షుడుగాను, రెండు ఉపాధ్యక్ష పదవులకు ఒంటెద్దు సూరిబాబు, ఇయ్యపు మురళీధర్, కార్యదర్శిగా ఆకుల శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శిగా తోట లక్ష్మీనారాయణ (కన్నా), కోశాధికారిగా అల్లంకి నాగేశ్వరరావు (బి10), మరికొంతమంది డైరెక్టర్లుగా ఎన్నికయ్యారు. ఈ క్రమంలో ఈనెల 29న జనరల్ బాడీ సమావేశం నిర్వహించబోతున్నారు. వచ్చే నెల మొదటి వారంలో ప్రమాణస్వీకారం చేసే అవకాశంఉంది.

విషాదాంతాలు

కాకినాడ జిల్లా తుని మండలం ఎర్రకోనేరు వద్ద హైవేపై ఇద్దరు బీబీఏ విద్యార్థులు బుల్లెట్‌పై విశాఖ నుంచి విజయవాడ వెళ్తుండగా వెనుక నుంచి కారు ఢీకొంది. ఈ ఘటనలో నాదెండ్ల నిరంజన్ (19), పోలిశెట్టి రేవంత్ (19) అనే ఇద్దరు విద్యార్థులు మృతి చెందారు. ఓ పరీక్ష కోసం వీరు వెళుతుండగా ఈ దుర్ఘటన జరిగింది. రేవంత్‌ది సొంతూరు భీమవరం. విజయవాడ కేఎల్ వర్సిటీలో చదువుతున్నారు. అలాగే తూర్పుగోదావరి జిల్లా రంగంపేట మండలం వడిశలేరులో బైక్ అదుపుతప్పి పడిపోవడంతో ఓ బీటెక్ విద్యార్థి మృతి చెందగా మరొక విద్యార్థి తీవ్రంగా గాయపడ్డాడు. - 7 పేజీలో..

పరీక్ష రాయడానికి వెళ్తూ అనంత లోకాలకు..


ఎర్రకోనేరు వద్ద కారు ఢీకొనడంతో తీవ్ర గాయాలతో పడి ఉన్న యువకులు

- బుల్లెట్‌ను వెనుక నుంచి ఢీకొన్న కారు
- ఇద్దరు బీబీఏ విద్యార్థులు మృతి
- ఒకరిది విజయవాడ, మరొకరిది భీమవరం
- బుల్లెట్‌పై విజయవాడ నుంచి విశాఖ వెళ్తుండగా ప్రమాదం
- కాకినాడ జిల్లా తుని మండలం ఎర్రకోనేరువద్ద ఘటన

తునిరూరల్, సెప్టెంబరు 21: పరీక్ష రాసేందుకు విజయవాడనుంచి విశాఖకు బుల్లెట్‌పై వెళ్తున్న ఇద్దరు యువకులను కారు రూపంలో మృత్యువు కబళించింది. తల్లిదండ్రులతో ఫోన్‌లో మాట్లాడిన గంటకే ఇద్దరూ అనంతలోకాలకు వెళ్లిపోవడంతో వారికి కడుపుకోత మిగిలింది. కాకినాడ జిల్లా 16వ నెంబరు జాతీయ రహదారిపై తుని మండలం ఎర్రకోనేరువద్ద శనివారం ఉదయం రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఇద్దరు బీబీఏ విద్యార్థులు తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు.


స్నేహితులు నిరంజన్ రేవంత్(ఫైల్)

పరీక్ష కోసం తెల్లవారుజామున పయనమై..

విజయవాడ అయ్యప్పనగర్‌కు చెందిన నాదెండ్ల నిరంజన్(19), పశ్చిమగోదావరి జిల్లా భీమవరానికి చెందిన పోలిశెట్టి రేవంత్(19) ఇద్దరూ స్నేహితులు. వీళ్లు విజయవాడ కేఎల్ యూనివర్సిటీలో బీబీఏ ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. ఇద్దరికీ శనివారం మధ్యాహ్నం విశాఖపట్నం లో ఎంపీటీఎల్ పరీక్ష ఉండడంతో బుల్లెట్‌పై తెల్లవారుజామున విజయవాడ నుంచి బయల్దేరారు. అలా వస్తూ.. వస్తూ ఓచోట ఆగి తమ తల్లిదండ్రులతో ఫోన్‌లో మాట్లాడి క్షేమంగానే వెళ్తున్నామని ఇరువురూ సమాచారం అందించారు. కాకినాడ జిల్లా తుని రూరల్ ఎర్రకోనేరు వచ్చేసరికి విశాఖపట్నం వెళ్తున్న కారు వీళ్ల బుల్లెట్‌ను వేగంగా ఢీకొట్టింది. దీంతో వీళ్ల ద్విచక్రవాహనం డివైడర్‌ను ఢీకొట్టగా యువకులు ఇద్దరూ ఎగిరిపడ్డారు. హెల్మెట్ ఉన్నప్పటికీ తీవ్రంగా గాయపడ్డారు. కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్న ఇద్దరినీ అటుగా వెళ్తున్న వాహనదారులు చూసి వారిని కాపాడే ప్రయత్నం చేశారు. తుని రూరల్ పోలీసులకు సమాచారం ఇవ్వగా ఇద్దరినీ స్థానికంగా తుని ఏరియా ఆస్పత్రికి తరలించారు. తీవ్రగాయాలపాలైన నాదెండ్ల నిరంజన్ ఆస్పత్రికి వెళ్లేసరికి మృతి చెందాడు. మరో యువకుడు పోలిశెట్టి రేవంత్ కూడా తీవ్రంగా గాయపడగా మెరుగైన వైద్యం కోసం కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. అతడు కూడా మృత్యువుతో పోరాడి వెంటిలేటర్‌పై తుదిశ్వాస విడిచాడు. ఈ సంఘటనపై తుని రూరల్ ఎస్ఐ కృష్ణమాచారి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఈ ఘటనలో కారు అతివేగంగా వచ్చి ఢీకొనడంతోనే ప్రమాదం జరిగిందని పోలీసులు భావిస్తున్నారు. కారులో ప్రమాద సమయంలో ముగ్గురు ఉన్నారని, వారిని తప్పించే ప్రయత్నం జరుగుతోందని మృతుల కుటుంబీకులు ఆరోపిస్తున్నారు.

క్షేమంగా వెళ్తున్నామంటూ విగతజీవులుగా మారి..

భీమవరానికి చెందిన పోలిశెట్టి రేవంత్‌కు తల్లిదండ్రులు ఉండగా అతడి స్నేహితుడు నిరంజన్‌కు తల్లి ఒక్కరే ఉన్నారు. ఇటీవలే తండ్రి మృతి చెందగా తల్లి భవాని ఉన్న ఒక్క కొడుకును అపురూపంగా పెంచుకుంటున్నారు. తుని ఏరియా ఆస్పత్రివద్ద విగతజీవిగా ఉన్న కొడుకు మృతదేహాన్ని చూసి ఆమె బోరున విలపించింది. ప్రమాదానికి ఒక గంట ముందే క్షేమంగా వెళ్తున్నామని చెప్పాడని, కాసేపటికే కొడుకు కానరాని లోకాలకు వెళ్లాడని తెలిసిందని ఆమె రోదించారు.


శ్రీసిద్ధివినాయక ఆలయంలో హుండీలను లెక్కిస్తున్న దృశ్యం

అయినవిల్లి సిద్ధివినాయకుడి ఆదాయం రూ.51,51,788

అయినవిల్లి, సెప్టెంబరు 21: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అయినవిల్లి శ్రీసిద్ధివినాయకస్వామి దేవస్థానంలో చవితి ఉత్సవాల ఆదాయం రూ.51,51,788 వచ్చింది. శనివారం హుండీలను లెక్కించారు. తొమ్మిదిరోజులు రాష్ట్రం నలుమూలల నుంచి లక్షా 50వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. భక్తుల రద్దీ అధికంగా ఉన్న సమయంలో ప్రత్యేక దర్శనాలు రద్దుచేసి ఉచిత దర్శనాలు ఏర్పాటుచేశారు. స్వామివారి అన్నప్రసాదాన్ని సుమారు 75వేల మంది స్వీకరించారని, తొమ్మిది రోజులపాటు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్టు ఆలయ ఈవో ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. వివిధ టిక్కెట్ల ద్వారా రూ.33,33,243, పండ్లరసాల ప్రత్యేకాభిషేకాలు 1341 టిక్కెట్ల ద్వారా రూ.3లక్షల 52వేలు, హుండీల ద్వారా రూ.14,65,545, జనరల్ హుండీల ద్వారా రూ.14,10,114, ఉత్సవ పందిరి హుండీ రూ.29,231, అన్నదాన హుండీ రూ.26,200, వెరసి మొత్తం ఉత్సవ ఆదాయం రూ.51,51,788 వచ్చినట్టు ఈవో ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. గత సంవత్సరం రూ.47,99,958 ఆదాయం వచ్చింది.

వెంకన్న ఆలయానికి పోటెత్తిన భక్తజనం

- స్వామివారి ఒక్కరోజు ఆదాయం రూ.30 లక్షలు


వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి

ఆత్రేయపురం, సెప్టెంబరు 21: వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తజనం పోటెత్తారు. వేకువజామునే స్వామివారికి సుప్రభాతసేవ, నీరాజన మంత్రపుష్పం, ఐశ్వర్యలక్ష్మీహోమం, బాలబోగం తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించి స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలకరించారు. వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారి తీరువీధులలో ఏడు ప్రదక్షిణలు నిర్వహించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భారీ క్యూలైన్ల స్వామివారిని దర్శించుకున్న భక్తులు తులభారాలు, కానుకలు సమర్పించుకుని అన్నప్రసాదం స్వీకరించారు. వివిధ సేవల ద్వారా స్వామివారి ఒక్కరోజు ఆదాయం రూ.30లక్షలు లభించినట్టు ఉపకమీషనరు భూపతిరాజు కిషోర్‌కుమార్ తెలిపారు. అలాగే రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్ స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదం స్వీకరించారు.

శృంగారవల్లభస్వామి ఆలయంలో భక్తుల రద్దీ

పెద్దాపురం, సెప్టెంబరు 21: కాకినాడ జిల్లా పెద్దాపురం మండలంలోని తిరుపతి శృంగారవల్లభస్వామి వారిని భక్తులు శనివారం దర్శించుకున్నారు. తెల్లవారుజామునుంచే భక్తులు స్వామి దర్శనానికి బారులు తీరారు. టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.1,15,710 అన్నదాన విరాళాలు రూ. 1,06,992 ఆదాయం, కేశఖండన ద్వారా రూ. 6,640, తులాభారం ద్వారా రూ.550, లడ్డూ ప్రసాదం విక్రయంద్వారా 22095 వెరసి రూ. 2,51,987 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. ఆలయానికి వచ్చే భక్తులకు పులిహోర, అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. దేవస్థానం అర్చకులు పెద్దింటి పురుషోత్తమా చార్యులు, నారాయణాచార్యులు పాల్గొన్నారు.


శృంగారవల్లభస్వామి

'లోవ' హుండీల ఆదాయం రూ.27.7లక్షలు

తునిరూరల్, సెప్టెంబరు 21: కాకినాడ జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన లోవ దేవస్థానంలో హుండీల లెక్కింపు కార్యక్రమం శనివారం నిర్వహించారు. దేవదాయశాఖ ఉప కమిషనర్ పి.విశ్వనాథరాజు, తనిఖీదారులు సీహెచ్ ఉదయ్‌బాబునాయుడు ఆధ్వర్యంలో హుండీలు తెరిచి ఆలయ సిబ్బంది లెక్కింపు చేపట్టారు. ఆలయానికి తరలివచ్చిన భక్తులు హుండీలో వేసిన కానుకల రూపేనా 48 రోజులకుగాను రూ.24.07లక్షలు ఆదాయం సమకూరిన ట్లు ఆలయ అధికారులు తెలిపారు.

హిందువులకు జగన్మోహన్‌రెడ్డి బేషరతుగా క్షమాపణ చెప్పాలి

- బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు సోము వీర్రాజు

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 21: తన ప్రభుత్వంలో జరిగిన తప్పులను దాచిపెట్టి హిందువుల మనోభావాలకు వ్యతిరేకంగా మాట్లాడిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డి తక్షణమే హిందువులకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు సోము వీర్రాజు డిమాండ్ చేశారు. శనివారం తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ గత ప్రభుత్వంలో స్వామివారి కైంకర్యానికి ఉపయోగించిన అన్ని వస్తువుల నాణ్యతపైనా పూర్తిగా దర్యాప్తు జరిపి బాధ్యులందరిపై చర్యలు తీసుకుని భక్తుల మనోభావాలను గౌరవించాలని ముఖ్యమంత్రి చంద్రబాబును కోరుతున్నామన్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రముఖ దేవాలయాల్లో ప్రసాదాలకు వినియోగించే నెయ్యి, బెల్లం, పచ్చిశెనగపప్పే కాదు ఇతర సరుకుల క్వాలిటీపైనా కూటమి ప్రభుత్వం దృష్టి పెట్టాలన్నారు. రూ.320కు అసలు నెయ్యి దొరుకుతుందా? ఎలా కొంటారు అన్నారు. విచ్చలవిడిగా మార్కెట్లో ఏ నెయ్యి బడితే అది కొన్నారన్నారు. తిరుమల లడ్డూ నాణ్యత వివాదంపై కేంద్ర మంత్రులు ఇప్పటికే స్పందించారని, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేపట్టే ఎలాంటి విచారణకైనా తమ సహకారం అందిస్తామని చెప్పారని సోము వీర్రాజు అన్నారు.

బైక్ అదుపుతప్పి విద్యార్థి మృతి


గాయాలపాలైన ప్రవీణ్‌కుమార్

- మరొకరికి తీవ్రగాయాలు

రంగంపేట, సెప్టెంబరు 21: బైక్ అదుపుతప్పి పడిపోవడంతో ఒకరు మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయని ఎస్ఐ తోట కృష్ణసాయి తెలిపారు. శనివారం ఉదయం 9గంటల సమయంలో రాజమహేంద్రవరం పరిధి మోరంపూడి గ్రామానికి చెందిన కొప్పిశెట్టి ప్రవీణ్‌కుమార్, కేతా మోహన్ వెంకటసాయి(17) అనే ఇద్దరు విద్యార్థులు బైక్‌పై సూరంపాలెం ఆదిత్య ఇంజనీరింగ్ కాలేజీకి వస్తుండగా రంగంపేట మండలం వడిశలేరు కార్గిల్ ఫ్యాక్టరీ వద్ద ఎదురుగా వస్తున్న కారును తప్పించబోయి అదుపుతప్పి బైక్‌ను ఢీకొనికింద పడిపోవడంతో ఇద్దరికీ తీవ్రగాయాలయ్యాయి. ఆ సమయంలో అటుగా వస్తున్న ఎస్.ఐ కృష్ణసాయి స్పందించి వారిని 108అంబులెన్స్‌లో రాజానగరంలో జీఎస్ఎల్ ఆసుపత్రికి తరలించారు. వెంకటసాయి చికిత్స పొందుతూ మృతిచెందగా, ప్రవీణ్‌కుమార్ చికిత్స పొందతున్నాడని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు. మృతుడు వెంకటసాయి ఇంజనీరింగ్ సెకండియర్ చదువుతున్నాడు.

విజిలెన్స్ తనిఖీలు.. కేసులు నమోదు

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): ఎస్‌వీజీ మార్కెట్‌లోని పలు షాపుల్లో విజిలెన్స్ ఎస్పీ కేఎస్ఎస్‌వీ సుబ్బారెడ్డి స్వీయ పర్యవేక్షణలో విజిలెన్స్, ఫుడ్ సేఫ్టీ, లీగల్ మెట్రాలజీ, మునిసిపల్, పంచాయతీ అధికారుల బృందం తనిఖీలు నిర్వహించింది. ఈ వివరాలను ఎస్పీ వెల్లడించారు. రాయల్ ఏజెన్సీ హోల్‌సేల్ అండ్ రిటైల్ దుకాణంలో చక్రగోల్డ్ టీపొడి నమూనాను ల్యాబ్‌కు పంపించామన్నారు. షాపు, గోదాముల్లో పరిశీలించగా ప్రభుత్వం నిషేధించిన 75మైక్రాన్ల కంటే తక్కువ మందం కలిగిన 6,526 కిలోల ప్లాస్టిక్ కవర్లను గుర్తించామన్నారు. వీటి విలువ రూ.6.52లక్షలు ఉంటుందన్నారు. స్టాక్‌ని స్వాధీనం చేసుకొని రూ.40వేలు జరిమానా విధించామని చెప్పారు. ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్సు కూడా లేకపోవడంతో షోకాజ్ నోటీసు ఇచ్చామన్నా రు. శ్రీ రామఎంటర్‌ప్రైజెస్‌లోని నిబంధనల ఉల్లంఘన లపై రెండు కేసులు పెట్టామన్నారు. రిద్ధిసిద్ధి ఏజెన్సీస్‌పై కూడా ఓ కేసు నమోదు చేసినట్టు ఎస్పీ పేర్కొన్నారు.

ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొని వ్యక్తి మృతి

- పనికి వెళ్లి వస్తుండగా జరిగిన ప్రమాదం


ప్రమాదంలో మృతిచెందిన కృష్ణ

కాకినాడరూరల్, సెప్టెంబరు 21: కాకినాడ జిల్లా కాకినాడరూరల్ ఇంద్రపాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎస్.అచ్చుతాపురంనకు చెందిన ద్రాక్షారపు కృష్ణ(48) చీడిగ వెంకటేశ్వరస్వామి ఆలయ సమీపంలోని ప్రధాన రహదారిలో శనివారం రాత్రి జరిగిన ప్రమాదంలో అక్కడికక్కడే మృతిచెందినట్లు ఎస్ఐ వీరబాబు తెలిపారు. మృతుడు కృష్ణ సెంట్రింగ్ పనిచేస్తాడని కొవ్వాడలో పనిముగించుకుని ఎస్.అచ్చుతాపురంలోని తన ఇంటికి మోటార్ సైకిల్‌పై వస్తుండగా అదే వైపుకు వెళుతున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్ ఢీకొట్టడంతో మృతి చెందాడన్నారు. మృతుడికి భార్య తిరుపతమ్మ, ఇద్దరబ్బాయిలు ఉన్నారు. భార్య తన భర్తను, కొడుకులు తండ్రిని కోల్పోవడంతో బోరున విలపించారు. మృతదేహాన్ని అంబులెన్స్‌లో కాకినాడ జీజీహెచ్‌కు తరలించగా మృతుడి భార్య ఫిర్యాదు మేరకు బస్ డ్రైవర్ డి.రామదాసుపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బస్సు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి



కిర్లంపూడి : కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలంలోని కృష్ణవరం టోల్‌ప్లాజా వద్ద శనివారం తెల్లవారుజామున ట్రావెల్ బస్సు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. వైజాగ్ నుంచి రాజమహేంద్రవరం వైపు వెళుతున్న ట్రావెల్ బస్సు వేగంగా అజాగ్రత్తగా డివైడర్ వద్ద నిలబడి ఉన్న వ్యక్తిని ఢీకొనడంతో తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందాడు. తెలుపు రంగు చొక్కా, నలుపు రంగు ప్యాంట్, మెరిసిన గెడ్డం కలిగి ఎరుపు బెడ్‌షీట్‌తో ఉన్నట్లు తెలిపారు. వీఆర్వో, మహిళా పోలీసు ఫిర్యాదుపై ఎస్ఐ సతీష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఆ వ్యక్తి అడ్రస్ తెలిసిన వారు కిర్లంపూడి పోలీస్‌స్టేషన్‌కు తెలపాలన్నారు.

రోడ్డు కం రైలు బ్రిడ్జిపై నుంచి గోదావరిలో దూకి వ్యక్తి గల్లంతు


బొల్లిపా రఘు(ఫైల్)

కొవ్వూరు, సెప్టెంబరు 21 : గోదావరిలో దూకి వ్యక్తి గల్లంతయిన సంఘటన తూర్పుగోదావరిజిల్లా కొవ్వూరు పట్టణంలో చోటుచేసుకుంది. చాగల్లు కొత్తపేట అరుందతి కమిటీ హాలు ప్రాంతానికి చెందిన బొల్లిపో రఘు (29) వృత్తిరీత్యా డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందులు తాళలేక మనస్థాపానికి గురై శనివారం మధ్యాహ్నం 2-30నుంచి 3గంటల సమయంలో మోటారుసైకిల్‌పై కొవ్వూరు రోడ్డు కం రైలు బ్రిడ్జిపైకి వచ్చాడు. బ్రిడ్జి 129వ స్తంభం వద్ద తన మోటారుసైకిల్, ఆధార్‌కార్డు, భార్య, తల్లిదండ్రులకు సూసైడ్ నోట్ రాసి గోదావరిలో దూకేశాడు. రఘుకి భార్య, పాప, బాబు ఉన్నారు. సమాచారం తెలుసుకున్న బంధువులు సంఘటనా స్థలానికి చేరుకుని నదిలో గజఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టారు. విషయం తెలుసుకున్న పట్టణ హెడ్ కానిస్టేబుల్ ఎం.సత్యనారాయణ సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. సుమారు గంటసేపు వంతెనపై ఇరువైపులా నిలిచిన ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. రఘు ఆన్‌లైన్ బెట్టింగ్‌లు ఆడతాడని, దీంతో అప్పులపాలుకావడంతో గోదావరిలో దూకి ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు.

గోదావరిలో మునిగి వృద్ధుడు మృతి

గోదావరిలో మునిగి వృద్ధుడు మృతి చెందినట్లు కొవ్వూరు పట్టణ ఎస్ఐ కె.జగన్మోహనరావు తెలిపారు. ఏలూరు జిల్లా కొయ్యలగూడెం మండలం డిప్పకాయలపాడు గ్రామానికి చెందిన పొలుబోను వెంకట్రావు(62) ఈనెల 20న అనారోగ్యంగా ఉందని రాజమహేంద్రవరం వెళ్లి వైద్యం చేయించుకుని వస్తానని చెప్పి ఇంటినుంచి వచ్చాడు. మరలా ఇంటికి తిరిగి వెళ్లకపోవడంతో చుట్టుప్రక్కల వెతికారు. శనివారం కొవ్వూరు భక్తాంజనేయ స్నానఘట్టం వద్ద మృతదేహం గోదావరిలో మునిగిపోయి, బో ర్లాపడి ఉందని సమాచారం తెలియడంతో బంధువులు వచ్చి చూడగా మృతదేహం వెంకట్రావుదిగా గుర్తించారు. మృతుని కుమారుడు పొలుబోను రాంబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు ఎస్ఐ జగన్మోహనరావు తెలిపారు.

రేపు రామచంద్రపురంలో బాస్కెట్‌బాల్ సెలెక్షన్స్

పిఠాపురం, సెప్టెంబరు 21: ఆంధ్రప్రదేశ్ మినీ బాలబాలికల బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనే క్రీడాకారుల ఎంపిక ప్రక్రియను ఈనెల 23న రామచంద్రపురం కంతేటి పేర్రాజు పంతులు క్రీడాప్రాంగణంలో నిర్వహిస్తామని బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లా కార్యదర్శి బొజ్జా మాణిక్యాలరావు(అయలు) తెలిపారు. ఇందులో ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లా బాలబాలికల జట్లును ఎంపిక చేస్తారని చెప్పారు. 2011 జనవరి 1వ తేదీ తర్వాత పుట్టి ఎంపికల్లో పాల్గొనేందుక ఆసక్తి కలిగిన క్రీడాకారులు ఒరిజనల్ ఆధార్, పుట్టినతేదీ సర్టిఫికెట్స్‌తో ఉదయం 8గంటలకు క్రీడాప్రాంగణానికి రావాలని ఆయన సూచించారు.

అన్నవరం దేవస్థానంలో సెంట్రల్‌స్టోర్స్, ప్రసాదం విభాగాలు తనిఖీ

అన్నవరం, సెప్టెంబరు 21: తిరుపతి ప్రసాదంలో వినియోగించే నెయ్యిపై ఆరోపణలు రావడం, శనివారం ఆంధ్రజ్యోతి కథనంపై ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ఆకస్మిక తనిఖీచేసి సెంట్రల్ స్టోర్స్, ప్రసాదం తయారీ విభాగాలను, అక్కడ వినియోగించే దినుసులు, రికార్డులను తదితర వాటిని పరిశీలించారు. నెయ్యి నాణ్యత, ధరలలో వ్యత్యాసంపై సూపరింటెండెంట్ బలువు సత్యశ్రీనివాస్‌ను అడిగారు. ప్రతి బ్యాచ్ నుంచి వచ్చిన వస్తువులను ల్యాబ్‌కు పంపించి సంతృప్తికరమైన రిపోర్టు వచ్చిన తరువాతనే దిగుమతి చేసుకుంటామని కొనుగోలుకు సంబంధించి ధరల వ్యత్యాసంపై గ్లోబల్, ఈప్రోక్యూర్‌మెంట్ టెండర్ల ద్వారా ఎవ్వరూ తక్కువకు సరఫరా చేయడానికి కోట్ చేస్తే వారి వద్దనుంచి కొనుగోలు చేస్తామని అన్నారు. నెయ్యిని పరిశీలించి వాసన రావడంలేదని ఎమ్మెల్యే ప్రశ్నించగా కొనుగోలు చేసేటప్పుడు కొద్దిగా పచ్చినెయ్యిని తీసుకొంటామని ప్రసాదం తయారీ సమయంలో మరోసారి వేడిచేయాల్సి ఉంటుందని నాణ్యత విషయంలో రాజీపడమని తెలిపారు. రామచంద్రమోహన్ ఈవోగా వచ్చిన తరువాత ఆయన ఆదేశాలతో సెంట్రల్‌స్టోర్‌లో కొనుగోలు, నాణ్యతపై మరింత కఠినంగా వ్యవహరిస్తున్నామని అనుమానం వస్తే తిరిగి పంపిస్తామని సూపరింటెండెంట్ సత్యశ్రీనివాస్ ఎమ్మెల్యేకు వివరించారు.

లారీలో తరలిస్తున్న 44 ఎద్దులు స్వాధీనం

గొల్లప్రోలురూరల్, సెప్టెంబరు 21: ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా తరలిస్తున్న ఎద్దులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. విజయనగరం నుంచి చిలకలూరిపేటకు లారీలో అక్రమంగా పశువులు తరలిస్తున్నట్లు అందిన సమాచారంతో కాకినాడజిల్లా గొల్లప్రోలు మండలం వన్నెపూడి జంక్షన్ వద్ద 16వ నెంబరు జాతీయ రహదారిపై శనివారం ఎస్ఐ ఎన్.రామకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. లారీ కంటెయినర్‌లో తరలిస్తున్న 44 ఎద్దులను వాహనంతోపాటు స్వాధీనం చేసుకున్నారు. ఎద్దులను గోశాలకు తరలించారు. వాహనానికి సంబంధించిన ఇద్దరు డ్రైవర్లు, పశువుల అక్రమ రవాణాకు పాల్పడుతున్న మరో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు గొల్లప్రోలు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

మరణంలోనూ ఒక్కటయ్యారు

గంట వ్యవధిలో భార్యాభర్తలు మృతి


పోలిశెట్టి ఆది చంద్రరావు(ఫైల్)


పోలిశెట్టి నాగవేణి(ఫైల్)

ముమ్మిడివరం, సెప్టెంబరు 21: నలభై ఏళ్ల పాటు ఎంతో అన్యోన్యంగా దాంపత్య జీవితం సాగించిన ఆ భార్యాభర్తలు గంట వ్యవధిలో తనువు చాలించారు. ఈ సంఘటన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం మండలం పళ్లవారిపాలెంలో శనివారం జరిగింది. పళ్లవారిపాలేనికి చెందిన పోలిశెట్టి ఆదిచంద్రరావు(65), భార్య నాగవేణి (58)లు ఎంతో అన్యోన్య దాంపత్యం. వీరికి కుమారుడు శ్రీనివాసరావు, కుమార్తె నేతికొండ శ్రీలక్ష్మి ఉన్నారు. వారికి వివాహాలు కూడా పూర్తయి పిల్లలు కూడా ఉన్నారు. అయితే ఆదిచంద్రరావు కొంత కాలంగా డయాలసిస్‌తో బాధపడుతున్నారు. ఈ క్రమంలో శనివారం అమలాపురంలోని కిమ్స్ ఆసుపత్రిలో డయాలసిస్ చేయించుకుంటుండగా మృతి చెందాడు. ఆ వార్త విన్న భార్య నాగవేణి ఉద్వేగానికిలోనై గుండె నొప్పి రావడంతో ముమ్మిడివరంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా మృతి చెందింది. దీంతో ఆ గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి. చంద్రరావు-నాగవేణి దంపతులకు ఇద్దరికీ కలిపి అంత్యక్రియలు నిర్వహించారు. ఆ దంపతుల అంతిమ యాత్రలో గ్రామస్తులంతా పాల్గొని నివాళులర్పించారు. ఆరు పదుల వయసులో వారిద్దరు ఒకరికి ఒకరై బ్రతికి చివరికి మరణంలో కూడా ఒక్కటయ్యారు. తనువులు వేరైనా తాము ఒక్కటే అన్నట్టుగా వారు నిలిచారు. తల్లిదండ్రులు ఒకేరోజు మృతి చెందడంతో వారి కుమారుడు, కుమార్తె విలపిస్తున్న తీరు గ్రామస్తులను కంటతడి పెట్టించింది.

పులస దొరికింది

- రెండు కేజీల పులస రూ.23వేలు



యానాం, సెప్టెంబరు 21: మాంసాహార ప్రియులు ఇష్టంగా తినే పులసల సీజన్ వచ్చింది. యానాంలో ఇటీవల వచ్చిన గోదావరి ఎర్రనీరు పోటెత్తే సమయంలో పులసలు లభ్యమవుతున్నాయి. గత కొన్ని రోజులు గా చిన్న చిన్న పులసలు లభ్యమైనప్పటికీ శనివారం వేటకువెళ్లిన యానాం మత్స్యకారులకు సుమారు రెండు కేజీలకుపైగా ఉన్న ఒరిజినల్ పులస చిక్కింది. దీనికి యానాం పుష్కర్‌ఘాట్‌లోని వేలం పాటలో కె.నాగలక్ష్మీ అత్యధిక ధర రూ.23వేలకు దక్కించుకున్నారు.

నమ్మిన మహిళే హతమార్చింది

వివాహేతర సంబంధం నేపథ్యంలో నమ్మిన మహిళే ఓ వ్యక్తిని హతమార్చి గుట్టుచప్పుడు కాకుండా పరారైన సంఘటనలో ముగ్గురు నిందితులను కాకినాడ త్రీటౌన్ పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. తరచూ డబ్బులు అడుగుతున్నాడన్న కారణంతో అడ్డు తప్పించుకోవాలన్న ప్రయత్నంలో భాగంగా ఈ హత్య చేసినట్టు పోలీసులు నిర్ధారించారు. త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో సీఐ కేవీవీ సత్యనారాయణ నిందితుల వివరాలను వెల్లడించారు. వివరాలిలా ఉన్నాయి.

- వివాహేతర సంబంధం కొనసాగించిన మహిళే సూత్రధారి
- తరచూ డబ్బులు అడుగుతున్నాడని హత్యకు పథకం
- కేసును ఛేదించిన పోలీసులు
- ఐదుగురు నిందితులు.. ముగ్గురి అరెస్ట్

కాకినాడ క్రైం, సెప్టెంబరు 21: కాకినాడ అర్బన్ తహసీల్దార్ కార్యాలయం ఎదుటివీధిలోని కాస్మో హోటల్ సమీపంలోని ఓ ఇంటి ప్రాంగణంలో ఈనెల 15న అయినవిల్లి మండలం వీరవల్లిపాలెం గ్రామానికి చెందిన ముద్రగడ ఈశ్వర దుర్గాప్రసాద్(39) హత్యకు గురయ్యాడు. ఈ సంఘటనపై సమాచారం అందుకున్న త్రీటౌన్ సీఐ కేవీవీ సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

నాలుగేళ్లుగా వివాహేతర సంబంధం

దర్యాప్తులో మృతుడు సామర్లకోట మండలం జి.మేడపాడుకు చెందిన కత్తుల దుర్గ అనే మహిళతో నాలుగేళ్లుగా వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడని తెలిసింది. సీఐ సేకరించిన వివరాల ప్రకారం.. 45రోజుల క్రితం కాకినాడ కాస్మో హోటల్ సమీపంలో ఉన్న ఇంట్లోకి దుర్గాప్రసాద్ అద్దెకు దిగాడు. దుర్గ తనకు తెలిసిన కొంత మంది మహిళలను తీసుకుని వచ్చి విటులను ఆకర్షించి అక్కడ వ్యభిచారం చేయించేది. ఈ క్రమంలో దుర్గాప్రసాద్ తన అవసరాలకు సరిపడా డబ్బులు ఇవ్వడం లే దని దుర్గతో గొడవపడేవాడు. ఆమె డబ్బులు ఇవ్వకపోయేసరికి దుర్గ భర్తకు వ్యభిచార విషయాన్ని తెలియపరుస్తానని బెదిరించేవాడు. ఈనెల 14న ఇద్దరిమధ్య ఘర్షణ జరిగింది. ఈనేపథ్యంలో ఈశ్వరదుర్గాప్రసాద్ తనతో ఉండడంవల్ల తనకు నష్టమేకానీ లాభం లేద ని గ్రహించిన దుర్గ ఎలాగైనా అతడిని మట్టుపెట్టాలని పథకం రచించింది.

ఐదుగురు నిందితులు కలిసి..

ఈ క్రమంలో తనకు వరుసకు తమ్ముడు అయిన సామర్లకోట బ్రౌన్‌పేటకు చెందిన కాకర నాగేశ్వరరావుకు దుర్గ ఫోన్‌చేసి విషయం చెప్పింది. అతడు తన స్నేహితుడైన పార్ల రాంబాబుతో కలిసి కాకినా డలోని దుర్గ ఇంటికి చేరుకున్నాడు. వీరిద్దరూ, దుర్గ, అక్కడ వ్యభిచారం సాగిస్తున్న విటుడు, మహిళ మొత్తం ఐదుగురు నిందితులు కలిసి ఈశ్వరదుర్గాప్రసాద్ కాళ్లు, చేతులు కట్టేశారు. సీలింగ్ ఫ్యాన్ హెడ్, కర్టెన్ రాడ్, సైకిల్ పెడల్ రాడ్, ఫ్యాన్ రాడ్లతో మృతుడి ముఖం, కాళ్లు, చేతుల మీద బలంగా మోదడంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. అనంతరం మృతదేహాన్ని ఇంటి వెనుక బాత్రూమ్ వద్ద పడేసి అక్కడి నుంచి నిందితులు పరారైనట్లు సీఐ వెల్లడించారు. అనంతరం పోలీసులు మూడు బృందాలుగా ఏర్పడి దర్యాప్తులో భాగంగా సాంకేతికత సహాయంతో కాకినాడ మెక్లారిన్ హైస్కూల్ దగ్గర స్కూల్ బిల్డింగ్‌లో శుక్రవారం అనుమానాస్పదంగా సంచరిస్తున్న ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. విచారణలో వారు కత్తుల దుర్గ, కాకర నాగేశ్వరరావు, పార్ల రాంబాబులుగా తెలిపారు. అనంతరం హత్య కేసు మిస్టరీ వీడింది. మరో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేయాల్సి ఉందని సీఐ తెలిపారు. ఈ కేసులో చాకచక్యంగా వ్యవహరించి నిందితుల అరెస్ట్‌కు సహకరించిన సీఐ సత్యనారాయణ, ఎస్ఐలు ఎం.సాగర్‌బాబు, పీవీసీ స్వామినాయుడు, బూలా శ్రీనివాస్ తదితరులను ఎస్పీ విక్రాంత్ పాటిల్, ఎస్‌డీపీవో రఘువీర్ విష్ణు ప్రత్యేకంగా అభినందించారు.

ఎన్టీఆర్ బీచ్‌లో కోస్టల్ సాగర్ సురక్షిత సాగర్ కార్యక్రమం

సర్పవరం జంక్షన్, సెప్టెంబరు 21:అంతర్జాతీయ తీర ప్రాంత పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా శనివారం కాకినాడ రూరల్ ఎన్టీఆర్ బీచ్‌లో ఇండియన్‌కోస్ట్ గార్డు ఆధ్వర్యంలో కోస్టల్ సాగర్ సురక్షిత సాగర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ తీరప్రాంతాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నా రు. సముద్రం, ప్రకృతి, భూమిపట్ల ప్రజల్లో గౌరవం తగ్గుతుందన్నారు. ప్లాస్టిక్ వల్ల రుతుపవనాల్లో మార్పులు చోటుచేసుకుంటున్నాయన్నారు. ప్లాస్టిక్‌కు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. బీచ్‌లో ఉన్న చెత్తా, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించి పంచాయతీ ట్రాక్టర్లపై డంపింగ్ యార్డుకు తరలించారు. కార్యక్రమంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, రోటరీ క్లబ్, అదాని, జెమినీ, కోరమండల్, రిలయన్స్, ఈకో, ప్లాస్టిక్, ఓఎన్జీసీ, మెరైన్ పోలీసులు, పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.




కాకినాడ సూర్యారావుపేట ఎన్టీఆర్ బీచ్‌లో ఇండియన్‌కోస్ట్ గార్డు ఆధ్వర్యంలో కోస్టల్ సాగర్ సురక్షిత సాగర్ కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

ఏజెన్సీ సమాచారం

హైవేతో చురుగ్గా గ్రామాల అభివృద్ధి: సబ్ కలెక్టర్

రాజవొమ్మంగి, సెప్టెంబరు 21: గిరిజన ప్రాంతం మీదుగా జాతీయరహదారి వేయడంవల్ల గ్రామాలు చురుగ్గా అభివృద్ధి చెందుతాయని రంపచోడవరం సబ్‌కలెక్టర్ కల్పశ్రీ అన్నారు. శనివారం సాయంత్రం మండలంలోని దూసరపాము గ్రామశివారులో జాతీయరహదారి నిర్మాణంలో భా గంగా ఇళ్లు కోల్పోతున్న ప్రజలతో ఆమె మాట్లాడారు. దూసరపాము గ్రామశివారులో ఆరు ఇళ్లకు నష్టపరిహారం ఇంకా చెల్లించకపోవడం, వేయనున్న సొమ్ములు కూడా తక్కువగా ఉన్నాయని, నష్టపరిహారం ఇప్పుడు తెలిపిన దానికి రెట్టింపు చెల్లించాలని అప్పటివరకు తమ ఇళ్లు ఖాళీ చేయమంటూ గ్రామస్థులు డిమాండ్ చేశారు. జాతీయరహదారి సర్వే సమయంలో అప్పటి సబ్ కలెక్టర్ కట్టా సింహాచలం తమ ఇళ్లకు రెట్టింపు నష్టపరిహారం చెల్లిస్తామని హామీ ఇచ్చారని గ్రామస్థులు సబ్ కలెక్టర్‌కు నివేదించారు. దీనిపై సబ్‌కలెక్టర్ రెవెన్యూ అధికారులను, జాతీయరహదారి నిర్మాణ అధికారులతో అక్కడే మాట్లాడి పూర్తి వివరాలు తెలుసుకున్నారు. ప్రజలందరికీ న్యాయం జరిగేలా చర్యలు చేపడతామని వారికి హామీ ఇచ్చారు. సబ్‌కలెక్టర్ ప్రజలతో మాట్లాడిన తీరుపై ప్రజలు హర్షం వ్యక్తంచేసి, ఏ అధికారి తమతో ఇలా మాట్లాడలేదని, చాలా మంది ఐఏఎస్ అధికారులైతే తమ సమస్యలు చెప్పుకునేందుకు అవకాశం ఇవ్వలేదని వాపోయారు. తహశీల్దార్ కరక సత్యనారాయణ, డిప్యూటీ తహశీల్దార్ అల్లు సత్యనారాయణ ఉన్నారు.

'సబ్సిడీని రైతులు సద్వినియోగం చేసుకోండి'

చింతూరు, సెప్టెంబరు 21: సబ్సిడీ ధరలతో ప్రభుత్వం అందిస్తున్న ఎరువులు, వంగడాలను రైతులు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా చింతూరు మండల వ్యవసాయ అధికారి డి.శ్రీనివాసరావు కోరారు. శనివారం ఎరువులు, వంగడాల విక్రయ కార్యక్రమాన్ని వ్యవసాయ అధికారి డి.శ్రీనివాసరావు, ఎంపీపీ అమల ప్రారంభించారు. ఈ సందర్భ ంగా ఏవో మాట్లాడారు. 100 క్వింటాళ్ల మినుము, 60 క్వింటాళ్ల పెసర వంగడాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. రైతు సేవా కేంద్రాలవద్ద రైతులు ఆయా వంగడాలను ఆధార్ జిరాక్స్‌లను సంబంధిత సిబ్బందికి అందజేసి పొందవచ్చన్నారు. కుమ్మూరు, ఏజీ కొడేరు కేంద్రాలలో యూరియా, పొటాష్ అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో జి.శరత్, ముత్తయ్య, నవీన్‌లు పాల్గొన్నారు.

'వరద రేషను పంపిణీలో అవినీతి'

చింతూరు, సెప్టెంబరు 21: ఏజీ కోడేరు పంచాయతీ పరిధిలో వరద బాధితులకు అందజేయాల్సిన రేషన్‌తోపాటు ఇతరత్రా నిత్యావసర వస్తువల పంపిణిలో కూడా అవినీతి జరిగిందని ఏజీ కొడేరు గ్రామ పంచాయతీకి చెందిన బీరబోయిన దిలీప్, కారం నగేష్, దర్శుల మల్లయ్యలు ఆరోపించారు. ఈ మేరకు వారు శనివారం ఐటీడీఏ పీవో అపూర్వ భరత్‌కు ఫిర్యాదు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ తమ గ్రామ పంచాయతీ పరిధిలో మూడు గ్రామాలు ఉన్నాయన్నారు. ఈఏడాది ఇప్పటివరకు రెండు పర్యాయాలు వరదలు రావడంతో తామంతా నష్టపోయామన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బంది ఇదే అదనుగా భావించి అవినీతికి తెరలేపారన్నారు. ఇందులో బాగంగా వారు రేషన్ కార్డు లేని కుటుంబాల సంఖ్యను అధిక మొత్తంలో చూపించారన్నారు. అనంతరం ఆమేరకు ఎలాట్ అయినటువంటి బియ్యం, నిత్యావసర వస్తువులు, టార్పాలిన్లను కూడా పక్కదారి పట్టించారని వారు ఆరోపించారు. ఈ మేరకు తాము ఐటీడీఏ పీవో అపూర్వ భరత్‌కు ఫిర్యాదు చేశామన్నారు. అధికారులు చర్యలు చేపట్టాల్సిందిగా వారు డిమాండ్ చేశారు.

గురజాడ జయంతి

వై.రామవరం, సెప్టెంబరు 21: పి.యర్రగొండ గురుకుల బాలికల కళాశాలలో శనివారం గురజాడ అప్పారావు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ శ్రీపాదరామకృష్ణ ఆధ్వర్యంలో గురజాడ అప్పారావు చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పిస్తూ ఆయన చేసిన సేవలు కొనియాడారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇది మంచి ప్రభుత్వం కరపత్రాల పంపిణీ

దేవీపట్నం, సెప్టెంబరు 21: కూటమి ప్రభుత్వం వంద రోజులు పూర్తయిన సందర్భంగా ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నారు. మండలంలో ఇందుకూరుపేట, ఇందుకూరు1 ఆర్‌అండ్‌ఆర్‌కాలనీల్లో ఇంటింటికీ శనివారం ఇది మంచి ప్రభుత్వం కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు మరిశెట్ల వెంకటేశ్వరరావు, సర్పంచ్ కుంజం రాజామణి, మాగా పు బాబురావు, కొత్తపల్లి అన్నవరం, రేలంగి రాంబాబు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

కూనవరం, సెప్టెంబరు 21: ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కూటమి నాయకులు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేసే సూర్యఘర్ సోలార్ పథకం పేద ప్రజలకు ఉపయోగపడుతుందన్నారు. ఈ పథకం ద్వారా ప్రతీ కుటుంబానికి విద్యుత్ ఆదా అవుతుందని తెలిపారు. దేశంలో ప్రతీ పేదవాడి కుటుంబంలో వెలుగు నింపాలన్నదే ఎన్డీఏ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో పాయం వెంకయ్య, నోముల సత్యనారాయణ, నోముల రామారావు పాల్గొన్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

కూనవరం, సెప్టెంబరు 21: మండలంలో కూటూరు వద్ద గుర్తుతెలియని మృతదేహం లభ్యమైంది. కూటురు, ముల్లూరు మధ్యలో ఉన్న కల్వర్టు దగ్గర మృతదేహం కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహం గుట్టలుపై నివశించే కొండరెడ్లదిగా అనుమానిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కూనవరం ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

మండల స్థాయి క్రీడాపోటీలు ప్రారంభం

కూనవరం, సెప్టెంబరు 21: మండలంలో అండర్ 14, 17 విద్యార్థుల క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయి. మండలంలోని మర్రిగూడెం ఉన్నత పాఠశాలలో ఈ క్రీడలు ప్రారంభించారు. ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్.వెంకటరావు పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సరియం అనిల్‌కుమార్, పాయం శాంత కుమారి, సున్నం వెంకటేష్, వరలక్ష్మి పాల్గొన్నారు.

అడ్డతీగలలో పోషణా మాసోత్సవ కార్యక్రమం

అడ్డతీగల, సెప్టెంబరు 21: పౌష్టికాహార మాసోత్సవాలలో భాగంగా శనివారం మండలస్థాయి పోషణా మాసోత్సవ కార్యక్రమం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారిణి వై.సుధ ఆధ్వర్యంలో స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంపీడీవో ఎం.వి.రంగారావు పాల్గొన్నారు. అనంతరం అంగన్‌వాడీ కార్యకర్తలు ఏర్పాటుచేసిన పోషకాహార స్టాల్‌ను సందర్శించి గర్భిణులకు సామూహిక సీమంతాలు చేశారు.

ఉమా ఎడ్యుకేషనల్, టెక్నికల్ సొసైటీ సేవలు అభినందనీయం

రంపచోడవరం, సెప్టెంబరు 21: ఏజెన్సీలో ఉమా ఎడ్యుకేషనల్, టెక్నికల్ సొసైటీ దివ్యాంగులకు అందిస్తున్న సేవలు అభినందనీయమని సబ్ కలెక్టరు కె.ఆర్.కల్పశ్రీ అన్నారు. శనివారం స్థానిక ఎంఆర్‌సీలో దివ్యాంగులకు కృత్రిమ పరికరాల పంపిణీ కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టరు మాట్లాడుతూ దివ్యాంగులు సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. జిల్లా వికలాంగుల సంక్షేమశాఖ సహాయ సంచాలకు లు జె.మాధవి, డీఈవో మల్లేశ్వరరావు, ఎంఈవో రామకృష్ణ, సీబీఆర్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు పెట్టెలు, సబ్బులు పంపిణీ చేయాలి

రంపచోడవరం, సెప్టెంబరు 21: పాఠశాల విద్యార్థులకు పెట్టెలు, సబ్బులు, కంచాలు, కొబ్బరినూనె తదితర వస్తువులు ప్రభుత్వమే అందజేయాలని ఆదివాసీ చైతన్య వేదిక సంక్షేమ సంఘం జిల్లా అధ్య క్షుడు వెదుళ్ల లచ్చిరెడ్డి శనివారం ప్రకటనలో డిమాండ్ చేశారు.

27లోగా దరఖాస్తు చేసుకోవాలి

రంపచోడవరం, సెప్టెంబరు 21: వేద విద్యను అభ్యసించి నిరుద్యోగులుగా ఉన్నవారు ప్రభుత్వం అందిస్తున్న నెలకు రూ.3వేలు నిరుద్యోగభృతి పొందేందుకు ఈనెల 27వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని అల్లూరి సీతారామరాజుజిల్లా దేవదాయశాఖ సహాయ కమిషనర్ సీపాని రాజారావు శనివారం ప్రకటనలో తెలిపారు. అర్హతగల అభ్యర్థులు తమ ఒరిజినల్ ధ్రువ పత్రాలతో జిల్లా దేవదాయశాఖాధికారి కార్యాలయంపాడేరులో అందజేయాలన్నారు.

వెలుగుచూడని విద్యుత్‌షాక్ మరణాలు

వై.రామవరం, సెప్టెంబరు 21: అల్లూరి జిల్లా వై.రామవరం మండలంలో విద్యుదాఘాతంతో అనేక రకాలుగా చాలామంది చనిపోతున్నారని, వాటిపై తగినచర్యలు తీసుకోవడంలో సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని, దీనిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు ఆదివాసీ చైతన్య వేదిక సంఘం జిల్లా అధ్యక్షుడు వెదుళ్ల లచ్చిరెడ్డి విలేకరులకు ఇచ్చిన ప్రకటనలో తెలిపారు. ఇటీవల దేవరమడుగులకు చెందిన లోతా సూరిరెడ్డి అడవి పందులకు విద్యుత్ తీగలు అమర్చిన సంఘటనలో మృతి చెందగా మృతదేహాన్ని పూడ్చిపెట్టి గోప్యత పాటించిన నిందితులపై ఇంత వరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. పి.యర్రగొండలో 33కేవీ విద్యుత్ తీగల కింద అనుమతిలేకుండా నిర్మించిన ఇంటిపై మోహనాపురం నుంచి బంధువుల ఇంటికి వచ్చి బట్టలు ఆరేస్తుండగా ప్రమాదవశాత్తూ విద్యుత్ తీగలు తగిలి మహిళ మరణించిందని దీనిపై ఎటువంటి చర్యలు చేపట్టలేదని ఆరోపించారు. బాధ్యులను కఠినంగా శిక్షించాలంటూ లచ్చిరెడ్డి కోరారు.

తూర్పుగోదావరి

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి • కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

24న సామాజిక తనిఖీ ప్రజావేదిక

గోకవరం, సెప్టెంబరు 21: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఈనెల 24న సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు ఎంపీడీవో పద్మజ్యోతి, ఉపాధి ఏపీవో అప్పలరాజు శనివారం తెలిపారు. ఉదయం 10.30 గంటలకు ప్రారంభమయ్యే ఈ ప్రజావేదికలో మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా గత ఏడాది ఏప్రిల్ నుంచి ఈ ఏడాది మార్చి 31 వరకు చేపట్టిన వివిధ రకాల పనులపై సమగ్ర నివేదిక సమర్పించనున్నట్టు చెప్పారు. ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ముఖ్యఅతిథిగా విచ్చేస్తారని చెప్పారు.

గత ప్రభుత్వ నిర్వాకంతో రాష్ట్రం దివాళ

- ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి
- పలుచోట్ల 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాలు

రాజమహేంద్రవరం రూరల్, సెప్టెంబరు 21: గత ప్రభుత్వం చేసిన నిర్వాకం వల్ల రాష్ట్రం దివాళ పరిస్థితికి చేరిందని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 100 రోజులు పూర్తయిన సందర్భంగా ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం శనివారం పలుచోట్ల నిర్వహించారు. శాటిలైట్ సిటీలోని జక్కంపూడి కల్యాణమండపంలో నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే గోరంట్ల విచ్చేసి మాట్లాడారు. రాష్ట్రం ఆర్థికంగా వెనుకబడి వున్నా ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అనుకున్న దాని కంటే ముందుగానే అమలు చేస్తున్నామని, దీపావళి కానుకగా ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ పథకాన్ని అమలు చేయనున్నట్టు చెప్పారు. తక్కువ సమయంలోనే మాట తప్పకుండా పింఛన్లు పెంచి ఇచ్చామని, ఉద్యోగులకు 1వ తేదీనే జీతాలు చెల్లిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పలు శాఖల అధికారులు, స్థానిక కూటమి నాయకులు తదితరుల పాల్గొన్నారు.

కడియం: వేమగిరిలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే గోరంట్ల శాఖల వారీగా సమీక్షించారు. కార్యదర్శి కె.రాజశేఖర్‌ను పిలిచి పంచాయతీలో 30 మంది కార్మికులున్నా ఎందుకు పారిశుద్ధ్యం మెరుగుపడలేదని ప్రశ్నించారు. దీంతో కొందరు సెలవులు పెడుతున్నారని బదులివ్వడంతో 20 మందిని ఉంచి పనిచేయని కార్మికులను తొలగించాలని కార్యదర్శికి సూచించారు. గ్రామంలో పారిశుద్ధ్యం పరిస్థితి నెలరోజుల్లో మారాలని లేకుంటే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. అలాగే పన్నుల వసూలు వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్, నాయకులు చెల్లుబోయిన శ్రీను, వెలుగుబంటి నాని, సూరపురెడ్డి జానకీరామ్, జంగా వినోద్, దంగేటి సత్తిబాబు, కోలా శ్రీను, సుంకర గోపాలకృష్ణ, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

దీపావళి నుంచి ఉచిత గ్యాస్ సిలిండర్లు: ఆదిరెడ్డి

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 21: దీపావళి నుంచి రాష్ట్రంలో



రాజమహేంద్రవరంలో ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాసు

కూటమి ప్రభుత్వ హామీ మేరకు ఉచితంగా గ్యాస్ సిలిండర్ల పంపిణీ చేపడతామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. శనివారం రాజమహేంద్రవరంలో 46,47,48,49 డివిజన్లకు సంబంధించి క్వారీ రోడ్డు శివాయం సమీపంలో జరిగిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమానికి ఆయన విచ్చేసి మాట్లాడారు. ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు పెన్షన్లు మొదలుకొని అన్న క్యాంటీన్లు, రైతులకు ధాన్యం బకాయిలు చెల్లింపు, పంచాయతీలకు నిధుల మంజూరు, ఉచిత ఇసుక విధానం వంటి కార్యక్రమాలు అమలు చేశామన్నారు. త్వరలో 50 ఏళ్లు నిండిన ఎస్సీ,ఎస్టీ, బీసీ మైనార్టీ వర్గాల్లో మహిళలకు వారి అర్హత మేరకు పెన్షన్ అందిస్తుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు,



రంగంపేట: పడిశలేరులో గర్భిణులకు సీమంతాలు చేస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

దొండపాటి సత్యంబాబు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్‌కుమార్, ఆర్యాపురం బ్యాంక్ చైర్మన్ చల్లా శంకర్రావు, అదనపు కమిషనర్ పీఎం సత్యవేణి, ఎస్ఈ పాండురంగారావు, కూటమి నాయకులు రెడ్డి మణి, వై.శ్రీను, వై.రంగబాబు పాల్గొన్నారు. టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ, కుడుపూడి సత్తిబాబు నగరంలో 47, 3డివిజన్లలో వేర్వేరుగా ఇది మన మంచి ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొని ప్రభుత్వ పథకాల అమలు తీరును వివరించారు.

వంద రోజుల్లోనే ప్రజల మన్ననలు: నల్లమిల్లి

రంగంపేట, సెప్టెంబరు 21: కూటమి ప్రభుత్వం ఏర్పడిన 100 రోజుల్లోనే ప్రజల మన్ననలను పొందిందని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. మండలంలోని వడిశలేరులో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్యతిథిగా విచ్చేసి ప్రసంగించారు. కూటమి ప్రభుత్వం ఏర్పాడ్డాకా వలంటీర్లు లేకుండానే సచివాలయ సిబ్బంది, కూటమి నాయకులతో మొదటిరోజే 94శాతం పింఛన్లు పంపిణీ చేశామన్నారు. కల్తీ నెయ్యి, గొడ్డు మాంసం, కొవ్వు వాడి తిరుపతి లడ్డూను అపవిత్రం చేసిన ఘనత జగన్‌కు దక్కుతుందన్నారు. ఈ సందర్భంగా గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. అనంతరం ఇది మంచి ప్రభుత్వం కరపత్రాలను ఆవిష్కరించి ఇంటింటికీ వెళ్లి అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆళ్ల గోవింద్, నీలపాల త్రిమూర్తులు, మండలాధ్యక్షుడు ఎలుగుబంటి సత్తిబాబు, ఉద్దండ్రావు



శాటిలైట్ సిటీ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గోరంట్ల

శ్రీను, పోతుల వెంకట్రావు, మాచిన వెంకన్నదొర, ఉప్పలపాటి బుల్లిదొర, ఎంపీడీవో పి.వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

అనపర్తి: మండంలోని కొప్పవరంలో సర్పంచ్ కర్రి బులిమోహనరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి విచ్చేసి వంద రోజుల పాలనలో నియోజకవర్గంలో సాధించిన ప్రగతిని ప్రజలకు వివరించారు. ఈ మేరకు ముద్రించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మోకా ఆనంద సాగర్ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు పాలనలో రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ కర్రి శేషారత్నం, తమలంపూడి సుధాకరరెడ్డి, సత్తి దేవదానరెడ్డి, పోతంశెట్టి సుభాషిణి, డీఎల్‌పీవో నాగలత తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం.. ప్రజా ప్రభుత్వం: బత్తుల

కోరుకొండ, సెప్టెంబరు 21: కూటమి ప్రభుత్వం పేదల మంచి కోరే ప్రజా ప్రభుత్వమని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అన్నారు. మండలంలోని పశ్చిమగోనగూడెంలో శనివారం సాయంత్రం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం ఎమ్మెల్యే బత్తుల, టీడీపీ ఇన్‌చార్జి బొడ్డు వెంకటరమణచౌదరి ఆధ్వర్యంలో నిర్వహించారు. 100 రోజుల కాలంలో కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. దీనిపై ముద్రించిన కరపత్రాలు అందజేశారు. అభివృద్ధికి రెక్కలు తొడిగి మొదటి వంద రోజుల్లోనే ఇది మంచి ప్రభుత్వమని ప్రజలతో కొనియాడబడిందన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు కంటే నాగకేశవరావు, తనకాల నాగేశ్వరరావు, గంగిశెట్టి చంటిబాబు, సర్పంచ్ రొంగల దేవిక, రొంగల శ్రీనివాసు, మళ్ళ అప్పలనర్సారావు, కొయ్యా శామ్యూల్, పలువురు అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు.



కోరుకొండ: పశ్చిమగోనగూడెంలో కరపత్రాలు ప్రదర్శిస్తున్న ఎమ్మెల్యే బత్తుల

ఎలుకల నివారణ సామూహికంగా చేపట్టాలి

రాజమహేంద్రవరం రూరల్, సెప్టెంబరు 21: ప్రస్తుతం సార్వా వరి పంటలో ఎలుకల బెడద తగ్గడనికి సామూహిక ఎలుకల నివారణ చేపట్టాలని ఏరువాక కేంద్ర శాస్త్రవేత్తలు కోఆర్డినేటర్ చల్లా వెంకటనరశింహరావు, ప్రధాన శాస్త్రవేత్త మానుకొండ శ్రీనివాస్ తెలిపారు. క్షేత్ర స్థాయి సందర్శనలో భాగంగా శనివారం మండలంలోని తొర్రేడులో వరి పొలాలను సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలం పరిధిలో సార్వా వరి ప్రస్తుతం ఈనిక దశకు దగ్గరలో వుందని, పంట ఆరోగ్యంగా వుందన్నారు. అక్కడక్కడా కొన్ని ప్రాంతాల్లో ఎండాకు తెగులు కనిపించిందన్నారు. అనంతరం ఎలుకల నివారణకు ఎలుక మందు పొట్లాలను రైతులకు పంపిణీ చేశారు. ఏరువాక ప్రయోగంలో భాగంగా మానిపండు తెగులు నివారణకు మందులను రైతులకు పంపిణీ చేసి స్వయంగా రైతులతో పిచికారీ చేయించారు.

రిజర్వేషన్ల వ్యతిరేకి రాహుల్‌గాంధీ

రాజమహేంద్రవరంలో బీజేపీ ఓబీసీ మోర్చా నిరసన



క్వారీ మార్కెట్ సెంటర్లో ఆందోళన నిర్వహిస్తున్న బీజేపీ శ్రేణులు

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 21: కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ రిజర్వేషన్ల వ్యతిరేకి అని పలువురు ఓబీసీ మోర్చా, బీజేపీ నాయకులు విమర్శించారు. దేశంలో రిజర్వేషన్లకు వ్యతిరేకంగా రాజీవ్‌గాంధీ అనుచిత వ్యాఖ్యలు చేశారని పేర్కొంటూ శనివారం రాజమహేంద్రవరం క్వారీ మార్కెట్ సెంటర్లోని బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ఎదుట బీజేపీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వాషింగ్టన్ జార్జిటౌన్ విశ్వవిద్యాలయంలోని విద్యార్థులతో రాహుల్‌గాంధీ మాట్లాడుతూ భారత్‌లో రిజర్వేషన్లు రద్దు చేస్తామని చెప్పడంతో కాంగ్రెస్ నిజస్వరూపం బయటపడిందన్నారు. విదేశాలకు వెళ్లిన ప్రతిసారీ భారత ప్రతిష్ట దిగజార్చేలా ఆయన మాట్లాడుతున్నారని విమర్శించారు. కార్యక్రమంలో బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు సోము వీర్రాజు, జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు సత్యసాయిరాం, కురగంటి సతీష్ వీరా వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

24 నుంచి నియోజకవర్గ క్రీడా పోటీలు

రాజానగరం, సెప్టెంబరు 21: నియోజకవర్గ స్థాయి స్కూల్ గేమ్స్ ఈ నెల 24 నుంచి నిర్వహించనున్నట్టు ఎంఈవో రామన్న దొర శనివారం తెలిపారు. ఉదయం 10గంటలకు రాజానగరం హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో ప్రారంభమయ్యే ఈ పోటీలు రెండు రోజుల పాటు జరుగుతాయని, మండల స్థాయిలో పోటీల్లో గెలిచిన విద్యార్థులంతా ఈ క్రీడా పోటీల్లో పాల్గొంటారని చెప్పారు.

స్కాలర్‌షిప్ కోసం దరఖాస్తు చేసుకోండి

ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులంతా ఈ నెల 24వ తేదీలోపు నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) పరీక్ష కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎంఈవో రామన్నదొర తెలిపారు. ఓసీ, బీసీ విద్యార్థులు రూ.100, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.50 పరీక్ష రుసుముగా చెల్లించాలని చెప్పారు. ఆసక్తి కలిగిన విద్యార్థులంతా తమ ఆధార్ కార్డు ఆధారంగా www.bse.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎంఈవో కోరారు.

ఎంఎస్ఎంఈతో స్వర్ణకారులకు అనేక పథకాలు

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 21: సూక్ష్మ చిన్న, మధ్య తరహా సంస్థలు (ఎంఎస్ఎంఈ) ద్వారా స్వర్ణకారులకు అనేక పథకాలున్నాయని ఆ శాఖ డీఎఫ్‌వో డీవీఎస్ మూర్తి అన్నారు. రాజమహేంద్రవరం గుండువారి వీధిలో సువర్ణ వర్తక సంఘం కళ్యాణ మండపంలో శనివారం రాజమండ్రి గోల్డ్ క్రాఫ్ట్ క్లస్టర్ ఆధ్వర్యంలో స్వర్ణకారులతో గండేబత్తుల శ్యామ్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో మూర్తితోపాటు నోడల్ ఏజెన్సీ ఎంపీ రాజకుమార్, ఇంప్లిమెంటింగ్ ఏజెన్సీ ధనలకోట శ్రీనివాస్, టెక్నికల్ ఏజెన్సీ సంజయ్‌దాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మూర్తి మాట్లాడుతూ పీఎం విశ్వకర్మ కౌశల్ యోజనను వినియోగించుకోవాలన్నారు. ఎంఎస్ఎంఈ ద్వారా అందిస్తున్న పథకాలపై అవగాహన కల్పించారు. అనంతరం క్లస్టర్ విధి విధానాలను ఏజెన్సీల ప్రతినిధులు వివరించారు.

తనిఖీలు ముమ్మరం చేయాలి: కమిషనర్

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 21: రాజమహేంద్రవరం కార్పొరేషన్ పరిధిలోని ఆహార తయారీ, విక్రయ కేంద్రాల తనిఖీలు ముమ్మరం చేయాలని కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశించారు. శనివారం రాత్రి మూడు ఫుడ్ కమిటీల సభ్యులతో ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడారు. నగరంలో ప్రతి హోటల్, ఇతర ఆహార తయారీ విక్రయ కేంద్రాల్లో తనిఖీలు చేసి శాంపిల్స్ సేకరణ పెంచాలన్నారు. సమావేశంలో ఎంహెచ్‌వో డాక్టర్ వినూత్న, శానిటరీ సూపర్‌వైజర్ ఇంద్రగంటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించండి

ఎస్పీ కిషోర్.. రాజానగరం పోలీస్‌స్టేషన్ ఆకస్మిక తనిఖీ



పోలీస్‌స్టేషన్‌లో సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ కిషోర్

రాజానగరం, సెప్టెంబరు 21: పోలీస్ స్టేషన్‌లో పెం డింగ్ కేసులు పేరుకుపోకుండా సత్వరమే పరిష్కరించాలని జిల్లా ఎస్పీ డి.నరసింహ కిషోర్ ఆదేశించారు. రాజానగరం పోలీస్‌స్టేషన్‌ను శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రిసెప్షన్ కౌంటర్, స్టేషన్‌కు సంబంధించిన పలు రికార్డులు, కేసుల నమోదుతో పాటుగా స్టేషన్‌ను ఆనుకుని పోలీస్ శాఖకు సంబంధించిన ఆస్తులను ఎస్పీ పరిశీలించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ పోలీస్‌స్టేషన్‌లో పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరగా పరిష్కరించడం, శాంతి భద్రతలకు భంగం వాటిల్లకుండా ప్రతిఒక్కరూ విధులు నిర్వర్తించాలని సూచించారు. మద్యం, గంజాయి, సారా అక్రమ రవాణా నియంత్రిస్తూ, ఎన్ఫోర్స్‌మెంట్ వర్క్‌ను పెంచాలన్నారు. సిబ్బందికి ఏవిధమైన ఇబ్బందులున్నా తన దృష్టికి తీసుకొస్తే, పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటానని ఎస్పీ కిషోర్ హామీ ఇచ్చారు. ఆయన వెంట ఎస్పీ సీఐ ఎ.శ్రీనివాసరావు తదితరులున్నారు. తొలుత ఎస్పీకి స్థానిక సీఐ ఎస్.ప్రసన్న వీరయ్యగౌడ్, ఎస్ఐ మనోహర్ పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.

ఉత్తమ పీఎల్వీలుగా అవార్డు సాధించాలి

డీఎల్ఎస్ఏ కార్యదర్శి ప్రకాశ్

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): పారా లీగల్ వలంటీర్లు(పీఎల్వీ) జాతీయ స్థాయిలో ఉత్తమ వలంటీర్లుగా పురస్కారం సాధించే దిశగా సేవలందించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ(డీఎల్ఎస్ఏ) కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రకాశ్‌బాబు పేర్కొన్నారు. పీఎల్వీలకు రెండో రోజు శిక్షణ సందర్భంగా నల్సా-అసంఘటిత కార్మికులకు న్యాయ సేవల పథకం-2015తోపాటు వివిధ చట్టాలపై అవగాహన కల్పించారు. అలాగే 1వ అదనపు సీనియర్ సివిల్ జడ్జి ఎస్‌కే జానీబాషా, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎన్.శ్రీలక్ష్మీ, 2వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎ.కృష్ణప్రసాద్, 5వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి జి.శ్రీనివాసరెడ్డి, 6వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎస్.రెడ్డి ప్రసన్న, 7వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి పి.బాబు వివిధ చట్టాలను వివరించారు.

రేషన్‌కార్డులను సమానంగా చేయాలి

జాయింట్ కలెక్టర్‌కు రేషన్‌డీలర్ల వినతి

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 21: ఒక్కో రేషన్‌షాపునకు కార్డులను తగ్గించి వికేంద్రీకరణ చేయడం వల్ల తమకు నెలకు వచ్చే పారితోషికం తగ్గిపోతుందని, ఒక్కో షాపునకు 8 వందల కార్డులకు తగ్గకుండా అందరికీ సమానంగా చేయాలని జిల్లా రేషన్ డీలర్ల సంఘం నాయకులు జాయింట్ కలెక్టర్‌ను కోరారు. శనివారం రేషన్ డీలర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జామి కృష్ణ ఆధ్వర్యంలో వివిధ మండలాల డీలర్లు జేసీ చిన్నరాముడును కలసి కార్డుల వికేంద్రీకరణ సమస్యపై వినతిపత్రం అందజేశారు. రాజమహేంద్రవరం కార్పొరేషన్ పరిధిలో షాపుల అద్దె, కరెంట్ ఛార్జీలు, కుటుంబ పోషణ దృష్టిలో పెట్టుకుని తమకు న్యాయం చేయాలని ఈ సందర్భంగా కృష్ణ విజ్ఞప్తి చేశారు. రాజమహేంద్రవరం అర్బన్ అధ్యక్షుడు నమ్మి, కార్యదర్శి రమేష్, టీవీఎన్ సాయిరెడ్డి, ఆదిరాజు, ఉదయభాస్కర్, ఉమా మహేశ్వరరావు, విజయదుర్గ, సాయి, జగదీష్, వెంకటేష్, దేవరపల్లి మండలం వెంకటరత్నం, కొవ్వూరు మండలం కొండలరావు, ధవళేశ్వరం మండలం వీర్రాజు తదితర డీలర్లు పాల్గొన్నారు.

పిడింగొయ్యిలో స్వచ్ఛ భారత్ ర్యాలీ

రాజమహేంద్రవరం రూరల్, సెప్టెంబరు 21: స్వచ్ఛభారత్ మిషన్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని పిడింగొయ్యి పంచాయతీ పరిధి ఎస్‌వీజీ మార్కెట్ నుంచి తిలక్ రోడ్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారంగా ఏర్పడి రోడ్లను, డ్రయిన్లను పరిశుభ్రంగా వుంచుకోవాలని, చెట్లు నాటి పరిరక్షించుకోవాలని, ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు.

'లడ్డూలో జంతువుల కొవ్వు వినియోగం హేయం'

గోకవరం, సెప్టెంబరు 21: పవిత్రమైన తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీలో జంతువుల కొవ్వుతో తయారు చేసిన నెయ్యి వాడడం హేయమని విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన వ్యవస్థాపకుడు కంబాల శ్రీనివాసరావు మండిపడ్డారు. గోకవరంలోని దేవిచౌక్ ఆలయం వద్ద శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తిరుమలలో జరిగిన అపవిత్రతపై ప్రభుత్వం తక్షణమే విచారణ జరిపి బాధ్యులను కఠినంగా శిక్షించాలన్నారు. హిందువుల మనోభావాలు దెబ్బతినేలా వ్యవహరించిన వారికి శిక్ష పడాలని అన్నారు.

ముళ్లపూడికి పితృ వియోగం

- బాపిరాజు తండ్రి వెంకటరత్నం అనారోగ్యంతో మృతి
- నివాళులర్పించిన ఎమ్మెల్యేలు మద్దిపాటి, బొలిశెట్టి, ముప్పిడి



నల్లజర్ల, సెప్టెంబరు 21: జడ్పీ మాజీ చైర్మన్ ముళ్లపూడి బాపిరాజు తండ్రి ముళ్లపూడి వెంకటరత్నం(76) శనివారం చికిత్స పొందుతూ మృతి చెందారు. గురువారం అనారోగ్యంతో విజయవాడ రమేష్ ఆసుపత్రిలో చేరగా చికిత్స పొందుతూ శనివారం మధ్యాహ్నం తుది శ్వాస విడిచారు. టీడీపీ సీనియర్ నాయకులుగా పార్టీకి అనేక సేవలందించారు. ఆయన భార్య విజయలక్ష్మి 2001లో నల్లజర్ల సర్పంచ్ సేవలందించారు. వెంకటరత్నం పార్థివ దేహానికి ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు, తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, ఈతకోట తాతాజీ, టీడీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు, చింతలపూడి నాయకులు, టీడీపీ మండలాధ్యక్షుడు తాతిన సత్యనారాయణ,యలమాటి శ్రీనివాసరావు, ఏలేటి సత్యనారాయణ, గొంటుముక్కల వేణు నివాళులర్పించారు. కాగా వెంకటరత్నంకు జడ్పీ మాజీ చైర్మన్ ముళ్ళపూడి బాపిరాజుతోపాటు మరో ఇద్దరు కుమారులు రామకృష్ణ, సురేంద్ర ఉన్నారు. ఇదిలా ఉండగా ఆయన పార్థివదేహానికి ఆదివారం ఉదయం 11గంటలకు హిందూ శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్టు బంధువులు తెలిపారు.

సమస్యల శాశ్వత పరిష్కారానికి కృషి

దివాన్‌చెరువు, సెప్టెంబరు 21: లాలాచెరువు హౌసింగ్ బోర్డు కాలనీలోని వివిధ సమస్యల శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ హామీ ఇచ్చారు. హౌసింగ్‌బోర్డుకాలనీలోని గ్రామసచివాలయాన్ని శనివారం ఆయన సందర్శించి అక్కడి సమస్యలపై స్థానికులను ఆరా తీశారు. తాగునీరు, వీధిలైట్లు సమస్యలపై కూటమి నాయకులతో అధికారుల సమక్షంలో చర్చించారు. అలాగే ఫోన్ ద్వారా నగరపాలక సంస్థ కమిషనర్ తెలియజేశారు.

హెచ్ఎంఐఎస్ యాప్‌పై అధికారులకు శిక్షణ

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 21: ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లోను, ఏఎన్ఎం రిజిస్టర్లలోనూ పొందుపరుస్తున్న సమాచారం, ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన సమాచారం సరి సమానంగా ఉన్నదీ లేనిదీ పర్యవేక్షించేందుకు హెల్త్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ వెరిఫికేషన్ (హెచ్ఎంఐఎస్) యాప్‌పై సంబంధిత నోడల్ అధికారులకు శనివారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి కార్యాలయంలోని గణాంక విభాగంలో చేపట్టిన ఈ శిక్షణలో భాగంగా డివిజన్ల వారీగా నోడల్ అధికారులకు శిక్షణ ఇచ్చారు. డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో ఎస్.సంధ్య పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో స్టాటిస్టికల్ ఆఫీసర్ జే.కుమారస్వామి, డీఎస్‌వో సీహెచ్ భాస్కర్, టి.వసుధ, జానకి తదితరులు పాల్గొన్నారు.

శ్రీరంగపట్నంలో మండల స్థాయి స్కూల్ గేమ్స్

కోరుకొండ, సెప్టెంబరు 21: శ్రీరంగపట్నం జడ్పీ హైస్కూల్లో శనివారం మండల స్థాయి అండర్-14, 17 స్కూల్ గేమ్స్ ఎంపికలను ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ మద్దాల రమణ, ఎంఈవో టి.కుశలవదొర, టీడీపీ నాయకుడు తనకాల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

వేంకటేశా! లడ్డూను అపవిత్రం చేసిన వారిని శిక్షించు

అనపర్తి, సెప్టెంబరు 21: తిరుపతి వెంకన్న లడ్డూ ప్రసాదంలో జంతువుల కొవ్వును ఉప యోగించిన వారిని శిక్షించి మమ్ములను మన్నించు అంటూ అనపర్తి కెనాల్ రోడ్డులోని వేంక టేశ్వర స్వామి ఆలయంలో పూజారి భోగేశ్వరశర్మ ఆధ్వర్యంలో భక్తులు మోకాళ్లపై నిలుచుని వేడుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్ర మంలో సిద్ధాంతి కలిదిండి రాము, ఆలయ కమిటీ ప్రతినిధి మల్లిడి కృష్ణారెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

గోకవరం, సెప్టెంబరు 21: జగ్గంపేట మండలం రాజపూడి జడ్పీ ఉన్నత పాఠశాల్లో శనివారం నిర్వహించిన ఆటల పోటీల్లో మండలంలోని కొత్తపల్లి ఆదర్శ పాఠశాల విద్యార్థులు విశేష ప్రతిభ కనబర్చి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. నియోజకవర్గస్థాయిలో జరిగిన బ్యాడ్మింటన్ అండర్-14 విభాగంలో దుర్గాప్రసాద్, అండర్-17 విభాగంలో రాజకుమార్, చదరంగం అండర్-14 విభాగంలో భరత్‌చంద్ర, కబడ్డీ అండర్-17 విభాగంలో ప్రవీణ్ ప్రతిభ కనబరిచి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైనట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ తెలిపారు.

చెరువులో పడిన వ్యక్తి కోసం గాలింపు

కోరుకొండ, సెప్టెంబరు 21: కోటికేశవరం గ్రామంలో చెరువులో ప్రమాదవశాత్తూ మునిగిపోయిన కడుగుల అమ్మిరాజు(40)కోసం తీవ్రంగా గాలిస్తున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ హుటాహుటిన చెరువు వద్దకు చేరుకుని గాలింపు చర్యలను పర్యవేక్షించారు. జనసేన కో ఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి, జనసైనికులు చెరువు వద్దకు చేరుకుని గ్రామస్థులను విచారించారు. నీటమునిగిన అమ్మిరాజు కోసం చెరువులో దిగి గాలిస్తున్నారు.







'నేతి'బీర చందమే..



నెయ్యి ఘుమఘుమలు..
మనకు కొత్తకాదు..!
ముద్దపప్పు, ఆవకాయ..
నెయ్యి కలిపితే ఆహా అంటాం
వేడి వేడి పూర్ణంబూరె..
చిల్లుపెట్టి ఓ చుక్క నెయ్యి
తగిలిస్తే ఓహో అంటాం
ఇంకా...
నేతి పెసరట్టు ఉప్మా..
లేదంటే ఒట్టి నేతి ఉప్మా..
నేతి బొబ్బట్లు
పూతరేకులు
సున్నండలు..
ఇలా..
ఏదైనా సరే,
నెయ్యి పడితేనే
బ్రహ్మాండం అంటాం
ఏ పూజా కార్యక్రమం జరిగినా
ఆవునెయ్యితోనే ఆరాధన
ఆలయాల్లోనూ దీపారాధన
నెయ్యితో చేసిన ప్రసాదమే
మనకు వర ప్రసాదం!
నెయ్యి మనోళ్లకు
ప్రీతిపాత్రం, పవిత్రం..
ఇంత ప్రాముఖ్యత కలిగిన
నెయ్యి నాణ్యతపై ఇప్పుడు చర్చ
జరుగుతోంది. అసలు నెయ్యిలో
నెయ్యి ఎంత? నిజమెంత?

ఆదివారం ప్రత్యేకం

(కాకినాడ -ఆంధ్రజ్యోతి)

- తిరుపతి ఘటనతో ఉమ్మడి జిల్లా ఆలయాల్లో నెయ్యి వాడకంపై ఎడతెగని చర్చ
- దేవస్థానాలకు సరఫరా అవుతోన్న నెయ్యి నాణ్యతపై సవాలక్ష సందేహాలు
- నెయ్యి దుమారం నేపథ్యంలో అన్ని ఆలయాల్లో నాణ్యతపై త్వరలో ప్రభుత్వం పరీక్షలు
- మరోపక్క ఏ ఆలయంలో చూసినా ప్రసాదాల్లో వాడే నెయ్యిపై భక్తులు తెగ ఆరా
- అటు గ్రామాలు, పట్టణాల్లోని దుకాణాల్లో విక్రయించే లూజు నెయ్యిపైనా కొత్తగా ఆరా
- సోషల్ మీడియా, ఇంటర్నెట్‌ల్లోనూ తాజాగా నెయ్యి ధరలపై జనం విపరీతంగా శోధన

ఈ నెయ్యి ఎక్కడి నుంచి వచ్చింది... ఎంతకు కొంటున్నారు.. దీంతో తయారుచేసే ప్రసాదం తింటే ఫర్వాలేదా... ఇదీ ఇప్పుడు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఎక్కడ చూసినా జరిగే చర్చ. తిరుపతి లడ్డూలో వినియోగించే నెయ్యిలో చేప నూనె, జంతువుల కొవ్వు ఆనవాళ్లు నిర్ధారణ జరిగి తీవ్ర సంచలనం రేపుతోన్న నేపథ్యంలో జిల్లాలోని పలు ఆలయాల్లో వినియోగించే నెయ్యిపై జోరుగా చర్చ నడుస్తోంది. ఇప్పటికే అన్నవరం దేవస్థానంలో వాడే నెయ్యి గడచిన రెండేళ్లుగా ఒకే కాంట్రాక్టర్ సరఫరా చేయడం తీవ్ర దుమారం రేపుతోంది. అలాగే అంతర్వేది, వాడపల్లి.. పాదగయ తదితర ఆలయాల్లో ఇచ్చే ప్రసాదాల్లో వినియోగించే నెయ్యి నాణ్యతపై ఇప్పుడు అందరి దృష్టిపడింది. దేవుడి దీపారాధనకు వినియోగించే నెయ్యి, ప్రసాదాల్లో వాడే నెయ్యి అసలు ఎక్కడి నుంచి వస్తోంది? ఎంత ధరకు కొంటున్నారు? నాణ్యత అసలు పాటిస్తున్నారా? అనే చర్చ రెండ్రోజులుగా జరుగుతోంది. మరోపక్క తిరుపతి ఘటనతో ఉమ్మడి జిల్లాలో ఆలయాల్లో అధికారులు సైతం ఉలిక్కి పడుతున్నారు. ఇంతకాలం వాడుతున్న నెయ్యి నాణ్యతపై పెద్దగా దృష్టిసారించని అధికారులు తాజా పరిణామాలతో నెయ్యి సరఫరా కాంట్రాక్టర్లను పిలిచి మాట్లాడుతున్నారు. నెయ్యి ఎక్కడి నుంచి తెస్తున్నారు? నాణ్యత మంచిదేనా అంటూ ఆరా తీస్తున్నారు. కాగా అన్నవరం దేవస్థానానికి ప్రస్తుతం నెయ్యి సరఫరా చేస్తోన్న కాంట్రాక్టరు గడువు ఈనెలతో ముగుస్తోంది. వచ్చేనెల ఒకటి నుంచి మరో కొత్త కాంట్రాక్టరు వస్తున్నారు. దీంతో ఆ నెయ్యిపైనా ఇప్పటినుంచే అధికారులు దృష్టిసారించారు. కొత్త కాంట్రాక్టు కంపెనీ తిరుపతిది కావడంతో అక్కడ ఎక్కడ కొనుగోలు చేస్తున్నారో కొందరు ఆరా తీస్తున్నారు. మరోపక్క తిరుపతి ఘటన దేశవ్యాప్తంగా తీవ్ర దుమారం రేపుతుండడం, ఇదే సమయంలో ఇతర ఆలయాల్లో వినియోగించే నెయ్యి నాణ్యతపైనా కొత్తగా సందేహాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. అన్ని ఆలయాల నుంచి నెయ్యి శాంపిళ్లను త్వరలో పరీక్షించాలని నిర్ణయించింది. అన్నవరంతోపాటు ఇతర ఆలయాల నెయ్యి శాంపిళ్లను అధికారులు సేకరించబోతున్నారు. కాగా ఆలయాల్లో ప్రసాదాలు, దీపారాధనకు వినియోగించే నెయ్యి ఎలాంటిది? ఎక్కడి నుంచి వస్తుంది? ఎంతకు ఆలయ అధికారులు కొనుగోలు చేస్తారు? వంటి వివరాలు ఇంతకాలం అసలు ఎవరు పట్టించుకోలేదు. కానీ తిరుపతి ఘటన వెలుగులోకి వచ్చిన తర్వాత ప్రతి చోటా నెయ్యి నాణ్యతపైనే అంతా చర్చించుకుంటున్నారు. ఇదిలాఉంటే కాకినాడ, రాజమహేంద్రవరం, అమలాపురంతోపాటు అనేక పట్టణాల్లో స్థానిక డెయిరీలు, ఇతర ప్రైవేటు వ్యాపారులు నెయ్యిని ప్యాకెట్లతోపాటు లూజుగాను విక్రయిస్తుంటారు. తాజా ఘటన నేపథ్యంలో ప్రజలు నెయ్యి నాణ్యతను ఆరా తీస్తూ జాగ్రత్త పడుతుండడం విశేషం. అటు సోషల్ మీడియాలోను ఇదే విషయం హాట్‌టాపిక్‌గా మారింది. అనేకమంది ఇంటర్నెట్‌లో నెయ్యి నాణ్యత తెలుసుకోవడం ఎలా? నాణ్యమైన నెయ్యి ఎలా తయారవుతుంది? వీటి ధర ఎంత? నికార్సయిన నెయ్యి కిలో ఎంత అంటూ తెగ శోధిస్తుండడం విశేషం. అలాగే స్వీట్‌స్టాళ్లలోనూ నెయ్యి వినియోగంపై వినియోగదారుల ఆరా కూడా పెరిగింది.

అయ్యో.. నెయ్యి!

- స్వచ్ఛత నై.. వెన్నతో పని లేకుండా వంటనూనె, డాల్డాతో తయారీ
- తరిగిన పాడి.. పెరిగిన వాడకం
- స్వచ్ఛత నిర్ధారించడం కష్టమే

పప్పు, ఆవకాయ అన్నంలో జుర్రున నెయ్యి పోసేసుకుంటున్నారా? పూర్ణం బూరె నిండా నెయ్యి వేసుకొని లొట్టలేస్తున్నారా? నేతి స్వీట్లను గుటుక్కుమని పిస్తున్నారా?.. ఇది మీ కోసమే. నెయ్యిని వివిధ రకాలుగా కల్తీ చేస్తున్నారు. నెయ్యిలో స్వచ్ఛతను పొయ్యి కూడా కనిపెట్టలేక పోతోంది. ఇవాళ పాడి బాగా తగ్గింది. కానీ మార్కెట్లో టన్నుల కొద్దీ నెయ్యి అందుబాటులో ఉంటోంది. అసలు వెన్న లేకుండా నెయ్యి తయారు చేయడమే ఈ దారుణంలో మతలబు మరి..!

(రాజమహేంద్రవరం -ఆంధ్రజ్యోతి)

నెయ్యిని రకరకాల పద్ధతిలో కల్తీ చేస్తున్నారు. నెయ్యి తయారీలో ప్రధాన ముడిసరుకు అయిన వెన్న లేకుండా కూడా నెయ్యిని తయారుచేసేస్తున్నారు. నెయ్యి తయారీ పరిశ్రమకోసం ఫుడ్‌సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా అనుమతి తప్పనిసరిగా ఉండాలి. రాష్ట్ర ప్రభుత్వ అనుమతులు కూడా కచ్చితంగా తీసుకోవాలి. సింథటిక్ ఫుడ్ కలర్స్, ఎసెన్స్‌ని అస్సలు కలపకూడదు. కల్తీ చేస్తే ఏకంగా రూ.5 లక్షల వరకూ జరిమానా విధించే అవకాశం ఉంది. కానీ ఇవేమీ అక్రమ వ్యాపారులను ఏమీ చేయలేకపోతున్నాయి. గ్రామాల్లో ఇళ్లను అద్దెకు తీసుకొని నెయ్యిని తయారు చేసేస్తున్నారు. వెన్న అవసరమే లేకుండా నెయ్యి తయారైపోతోంది. కోలమూరులో ఓ తయారీ కేంద్రాన్ని ఐదు నెలల కిందట ఫుడ్ సేఫ్టీ, విజిలెన్స్ అధికారులు సీజ్ చేశారు. ఇక్కడ నూనెతో నెయ్యిని తయారు చేస్తున్నారు. వంట నూనెను వేడి చేసి దానికి డాల్డాను జోడించి నెయ్యి వాసన రావడం కోసం ఫ్లేవర్‌ని కలుపుతున్నారు. అంతేకాకుండా గేదె నెయ్యికంటే ఆవునెయ్యి రేటు ఎక్కువ. కొవ్వు తక్కువగా ఉంటుందనే కారణంతో కూడా ఆవునెయ్యి వాడకం ఇటీవల ఎక్కువైంది. పూజల్లోనూ ఆవునెయ్యినే వాడతారు. గేదెనెయ్యి కాస్త తెల్లగా, ఆవునెయ్యి లేత గోధుమ రంగులో ఉంటుంది. అసలే కల్తీగా తయారుచేస్తున్న గేదె నెయ్యిలో గోధుమరంగు సింథటిక్‌కలర్‌ని జోడిస్తున్నారు.

ఎలా కనిపెట్టాలి...

నెయ్యి స్వచ్ఛతను కనిపెట్టడం అంత సులభం కాదు. నెయ్యి నమూనాలను నాచారం (హైదరాబాద్)లోని ఫుడ్ ల్యాబొరేటరీకి పంపించాల్సి ఉంటుంది. నెయ్యి పెద్దఎత్తున ప్రజలు వినియోగిస్తున్నా కల్తీని ప్రాథమికంగా నిర్ధారించే పరికరాలు కూడా జిల్లా ఫుడ్ కంట్రోల్ అధికారుల వద్ద లేవు. అయితే ఇంట్లో కొద్ది వరకూ తెలుసుకునే వీలుంది. దేశీ నెయ్యికి కొన్ని చుక్కల అయోడిన్ ద్రావణం కలిపి కొంత సమయం తర్వాత గమనించాలి. రంగు మారితే కల్తీ నెయ్యి కావచ్చు. గ్లాసు గోరు వెచ్చని నీటిలో నెయ్యి వేసి చెంచాతో బాగా కలపాలి. అది కల్తీ నెయ్యి అయితే నీటితో త్వరగా కరగదు. స్వచ్ఛమైనది అయితే నీటిలో కరిగి జిడ్డులా పైకి తేలుతుంది. నెయ్యిని ఎక్కువ ఉష్ణోగ్రత వద్ద కాచినపుడు కాలిన వాసన రాకూడదు. నెయ్యిలో డబ్బాలో వేసి ఫ్రిజ్‌లో పెడితే కాసేపటికి గాలి బుడగలు ఏర్పడినా, నూనెలా తేలినా కల్తీ జరిగినట్టే. స్వచ్ఛమైన నెయ్యిని అరచేతిపై వేస్తే అది జారకుండా కొన్ని క్షణాల తర్వాత కరగడం ప్రారంభిస్తుంది. కల్తీ చేసిన నెయ్యి బాగా జిడ్డుగా, రంగులో కూడా తేడా ఉంటుంది. స్వచ్ఛమైన నెయ్యి లేత పసుపు రంగులో ఉండి సూక్ష్మ పూసలుగా ఉంటుంది. నెయ్యి తయారీ కేంద్రాలు, హోటళ్లు, స్వీట్‌షాపులపై ముమ్మర తనిఖీలు చేస్తామని తూర్పుగోదావరి జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి రుక్కయ్య తెలియజేశారు.



నెయ్యి కిలో రూ.300 నుంచి రూ.4,600 దాకా..

గేదెపాలలో 6 నుంచి 10 శాతం వెన్న శాతం (ఫ్యాట్) వస్తుంది. కిలో నెయ్యి తయారుకావాలంటే 10 నుంచి 15 లీటర్ల పాలు కాచి, తోడుపెట్టి, పెరుగు నుంచి చిలికి వెన్నతీసి తద్వారా నెయ్యి వస్తుంది. ధర రూ.వెయ్యి వరకు పలుకుతుంది. అలానే ఆవునెయ్యిలో 3 నుంచి 4.5 శాతం వెన్నశాతం (ఫ్యాట్) వస్తుంది. కిలో ఆవునెయ్యి తయారు కావాలంటే 35 నుంచి 40 లీటర్ల పాలు కాచి, తోడుపెట్టి, పెరుగు నుంచి కవ్వంతో చిలికి వెన్న తీసి తద్వారా నెయ్యి వస్తుంది. ప్రస్తుతం అత్యంత స్వచ్ఛమైన ఆవునెయ్యి రూ.4,600 ధర ఉందని కడియం మండలం మురమండ గ్రామానికి చెందిన పాడిరైతు మరిడి సత్యనారాయణ చెప్పారు. కానీ కొందరు రైతులు రూ.800 నుంచి రూ.1500 మధ్య విక్రయిస్తున్నారు. మార్కెట్‌లో ఆవునెయ్యి రూ.300 నుంచి రూ.3 వేల వరకు లభిస్తోంది. డాల్డాలో కొద్దిపాటి నెయ్యి, పసుపు కలిపి ఆవునెయ్యి రంగు వచ్చేటట్టు, అలానే ఎస్సెన్సు కలిపి ఆవు నెయ్యి వాసన వచ్చేట్టు చేసి విక్రయిస్తున్నారు. **- కడియం/ప్రత్తిపాడు/జగ్గంపేట**



దీపాలు వెలిగించే నెయ్యి కల్తీనే..

దేవుని వద్ద ఉంచే దీపంలో ఆవునెయ్యి వేసి వెలిగిస్తే పుణ్యం దక్కుతుందని భక్తుల నమ్మకం. అదే నమ్మకాన్ని పెట్టుబడిగా చేసుకుని అందులో కల్తీకి పాల్పడుతూ కోట్లు గడిస్తున్నారు కొందరు అక్రమార్కులు. పశువుల కొవ్వులో కొన్ని రసాయనాలు కలిపి అచ్చమైన ఆవు నెయ్యిగా తయారు చేస్తున్నారు. పిఠాపురం పట్టణంలోని రెండు ప్రాంతాలతోపాటు గొల్లప్రోలు మండలం దుర్గాడ, శంఖవరం మండలం కత్తిపూడి తదితర ప్రాంతాల్లో వీటి తయారీ అధికంగా ఉంది. కార్తీకమాసంతో పాటు శ్రావణమాసం, ఇతర ముఖ్య పర్వదినాలు, వివిధ దేవుళ్ల మాలల సమయంలో ఆవునెయ్యితో తయారుచేసిన వత్తులు, దీపం వెలిగించేందుకు ఆవునెయ్యిని వినియోగిస్తారు. ఈ డిమాండుతో కల్తీ నెయ్యితో కలిపి తయారుచేసిన వత్తులను, కల్తీ నెయ్యిను అందమైన ప్యాకింగ్ చేసి ఆవునెయ్యిగా విక్రయాలు జరుపుతున్నారు. కొందరు అక్రమార్కులు వీటికి ప్రముఖ బ్రాండ్ల స్టిక్కర్లు అంటిస్తున్నారు. గతంలో పిఠాపురం పట్టణంలో నాలుగుసార్లు, గొల్లప్రోలు మండలం దుర్గాడలో రెండుసార్లు భారీగా కల్తీనెయ్యిని రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ల్యాబ్‌కు శాంపిల్స్‌ను మార్చి వేసి కేసుల నుంచి తప్పించుకున్నట్టు ప్రచారం జరిగింది. ఆలయాల వద్ద కల్తీ నెయ్యి దీపాల విక్రయాలే సాగుతున్నాయి. **- పిఠాపురం**



వాడపల్లిలో హెరిటేజ్ నెయ్యి

కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో లడ్డూ ప్రసాదం గత కొన్నేళ్ల నుంచి హెరిటేజ్ బ్రాండ్ నెయ్యినే వాడుతున్నారు. 2017 నుంచి ప్రారంభమైన స్వామివారి లడ్డూ తయారీ విక్రయాలు హెరిటేజ్ బ్రాండ్ నెయ్యితో తయారుచేస్తున్నారు. రావులపాలెంకు చెందిన హెరిటెజ్ డీలర్లు టెండర్ ద్వారా ఈ నెయ్యిని సమకూరుస్తున్నారు. ప్రస్తుతం హెరిటెజ్ కిలో నెయ్యి రూ.628కు టెండర్‌దారుడు అందిస్తున్నారు. నెలకు 2వేల కిలోల నెయ్యి అవసరంకాగా 1.70 లక్షల లడ్డూలు తయారవుతున్నాయి. లడ్డూ రూ.15కి భక్తులకు విక్రయిస్తున్నారు. **- ఆత్రేయపురం**



పూతరేకు, స్వీట్లలోనూ కల్తీ నెయ్యి

ఆత్రేయపురం పూతరేకులంటే ఎంతో ప్రసిద్ధి. కొందరు కాసులకు కక్కుర్తిపడి కల్తీ నెయ్యి వాడేస్తున్నారు. కల్తీనెయ్యి వీరికి కిలో రూ.200కు, రూ.300కు కూడా దొరుకుతోంది. బ్రాండ్ నెయ్యి రూ.700 నుంచి రూ.900. అలాగే ఘీస్వీట్ల తయారీలో వాడే నెయ్యిలోనూ జోరుగా కల్తీ జరుగుతోందని తెలుస్తోంది.



మిషన్ నుంచి పచ్చి పాలతో వెన్న తీస్తున్న దృశ్యం

నెయ్యి ఎన్ని రకాలు.. ఎలా తయారు చేస్తారు..

గేదె లేదా ఆవు పాలు కాచి, తోడుపెట్టి, పెరుగు నుంచి మీగడ చిలికి.. వెన్నతీసి.. దాన్ని కాచి నెయ్యి తీస్తారు. కవ్వంతో చిలికిన వెన్నతోనే పూర్వం నెయ్యి తయారు చేసేవారు. నెయ్యి కాస్తుంటే ఆ ప్రాంతమంతా మంచి సువాసనతో ఘుమఘుమలాడేది.

తర్వాత పచ్చిపాల నుంచి క్రీమ్ తీసి అది వెన్నగా మార్చి నెయ్యి చేసేవారు. గేదెపాల నుంచి లీటరుకు 70 గ్రాములు, ఆవుపాలు 80 గ్రాములు వెన్న తీసి దాన్ని నెయ్యిగా చేసి వివిధ పేర్లతో మార్కెట్‌లో నెయ్యి సప్లయి చేసేవారు. అది నాణ్యతగానే ఉండేది.

కొన్ని చిన్న చిన్న నెయ్యి తయారీ కేంద్రాల వారు ప్రముఖ పాల ఉత్పత్తుల కంపెనీల నుంచి బటర్‌ను కొనుగోలు చేసి నెయ్యి చేస్తారు. లేదంటే నేరుగా నాణ్యత కలిగిన పాలను సేకరించి బటర్ తయారు చేసుకుని దాన్నించి నెయ్యి తయారుచేస్తారు. **- గండేపల్లి/సామర్లకోట**

పశువుల కొవ్వుతో ఇలా..

రాజమహేంద్రవరం, తణుకు, నిడదవోలు ప్రాంతాలకు చెందిన వ్యాపారులు పశుమాంసం కొవ్వుకు వివిధ రసాయనాలు జోడించి పామాయిల్‌తో మిక్సింగ్ చేసి విక్రయిస్తున్నారు. ఈ నెయ్యి వల్ల గుండె సంబంధిత వ్యాధులు, కిడ్నీ సమస్యలు, కొలస్ట్రాల్ పెరగడం, నరాల బలహీనత వంటి వ్యాధులకు లోనవుతున్నారు.

బదిలీల సందడి

రేపటితో ప్రక్రియ పూర్తి.. ఇప్పటికే కొలిక్కి..

(రాజమహేంద్రవరం -ఆంధ్రజ్యోతి)

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత బదిలీల సందడి మొదలైన సంగతి తెలిసిందే. మొదట్లో జిల్లా కలెక్టరు, ఎస్పీ, జేసీ, మున్సిపల్ కమిషనర్లు, తహశీల్దార్లు, అడిషనల్ ఎస్పీలు, డీఎస్పీలు, సీఐల బదిలీలు జరిగిన సంగతి తెలిసిందే. జిల్లాలో ఐదేళ్ల సర్వీసు పూర్తిచేసుకున్న వారందరికీ బదిలీలు ఉన్నాయి. అవికాకుండా పరిపాలనపరమైన అవసరాల కోసం, అనారోగ్యం, భార్యాభర్తలు ఉద్యోగులు వంటి ప్రత్యేక పరిస్థితుల్లో కూడా బదిలీలు జరుగుతున్నాయి. ఇంతకుముందే బదిలీల ప్రక్రియ పూర్తికావలసిఉంది. కానీ విజయవాడలో వరదలతోపాటు, అన్ని జిల్లాల్లోనూ వానలు, వరదలు ముంచెత్తడంతో ఈ ప్రక్రియను ఈనెల 23వ తేదీ వరకూ పెంచారు. దీంతో ప్రస్తుతం అన్ని ప్రభుత్వ కార్యాలయాలలోనూ ఇదే సందడి నెలకొంది. జిల్లాలో అన్ని ఇంజనీరింగ్ విభాగాల్లోనూ, కమర్షియల్ ట్యాక్స్, రెవెన్యూ, వార్డు- గ్రామ సచివాలయాలు, పంచాయతీలు, మున్సిపాల్టీలు, ఇరిగేషన్‌శాఖల పరిధిలో ఈ బదిలీలు జరగనున్నాయి. ఎక్సైజ్‌లో ఈనెలాఖరు వరకూ అవకాశం ఉంది. ఒక వైద్య శాఖ తప్ప అన్ని విభాగాల్లోనూ బదిలీలు జరుగుతున్నాయి. ఇప్పటికే జాబితాలు సిద్ధమయ్యాయి. రేపోమాపో ఆర్డర్లు రానున్నాయి. ఐదేళ్ల పూర్తయిన ఉద్యోగులు తమకు ఇష్టమైన ప్రాంతాలకు వెళ్లడానికి ప్రయత్నిస్తున్నారు. దీంతో ఎమ్మెల్యేలు, ఎంపీల సిఫార్స్ లెటర్లు కూడా తీసుకుంటున్నారు. కొన్ని విభాగాల్లో పోస్టును బట్టి డబ్బుతో పనిచేస్తున్నట్టు గుసగుసలు వినిపిస్తున్నాయి. కొన్నిచోట్ల సాధారణ బదిలీలే జరుగుతున్నాయి. గతంలో పోలీసులు, తహశీల్దార్ల పోస్టుల్లో డబ్బులు ప్రభావం చూపినట్టు ప్రచారం జరిగిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఇంజనీరింగ్ విభాగాల్లో కూడా ఈ పరిస్థితి చోటుచేసుకుంది. కానీ ఐదేళ్ల పూర్తయినా మంచి అధికారులు, చక్కగా పనిచేయించే వారిని కొంత కాలం ఉంచాలనే ఆలోచన కూడా ప్రజాప్రతినిధులు చేయడం గమనార్హం. కానీ ప్రభుత్వం ఐదేళ్ల పూర్తయిన వారిని కచ్చితంగా బదిలీ చేయాలనే ఆలోచనతో ఉండడం వల్ల ప్రజాప్రతినిధుల పట్టు కూడా పనిచేయడంలేదు. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్‌కు సంబంధించి రాజమహేంద్రవరం రీజినల్ డైరెక్టర్ కార్యాలయం పరిధిలో జూనియర్ అసిస్టెంట్లు, సీనియర్ అసిస్టెంట్లు, ఇతర ఉద్యోగులు మొత్తం 82 మంది వరకూ బదిలీ కానున్నారు. కొన్ని పెరిగినా పెరగవచ్చు. అనారోగ్యం తదితర కారణాలతో ఇంకా ఎవరైనా రిక్వెస్ట్‌లు పెట్టుకున్నా వారినీ బదిలీ చేసే అవకాశం ఉంది. కానీ దీనికి ఇక ఒక్కరోజే మిగిలి ఉంది. ఆదివారం సెలవు. ఇక సోమవారం ఉదయం ఆర్డర్లు ఇచ్చే అవకాశం ఉంది. కమర్షియల్ ట్యాక్స్ (జీఎస్టీ) కార్యాలయాలకు సంబంధించి కాకినాడ నోడల్ డివిజన్ పరిధిలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్లు, సీనియర్ అసిస్టెంట్లు మొత్తం 50 మంది బదిలీ అయ్యారు. ఎగ్జిక్యూటివ్ టాక్స్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు 16 మంది, గూడ్స్ అండ్ సర్వీసు ట్యాక్స్ (జీఎస్టీ) అధికారులు 25 మంది బదిలీ అయ్యారు. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు కూడా కొంతమంది బదిలీకానున్నారు. వీరి బదిలీలు ఉమ్మడి జిల్లాల పరిధిలో జరుగుతున్నాయి. ఇక ఒక్కరోజు మాత్రమే అవకాశం ఉన్నప్పటికీ ఎవరి ప్రయత్నాలు వారు చేస్తున్నారు. సోమవారం నాటికి మొత్తం బదిలీల ప్రక్రియ పూర్తవుతుంది. ఎక్సైజ్‌శాఖకు ఈనెలాఖరు వరకూ గడువు ఉంది.

నేడు కార్యదర్శులకు కౌన్సెలింగ్

రాజమహేంద్రవరం పరిధి బొమ్మూరులోని కలెక్టరేట్‌లో బదిలీలకు సంబంధించి పంచాయతీ కార్యదర్శులకు ఆదివారం కౌన్సెలింగ్ జరుగనుంది. రాజమహేంద్రవరం డివిజన్‌లోని కార్యదర్శులకు ఉదయం 10.30 గంటలకు, కొవ్వూరు డివిజన్‌లోని కార్యదర్శులకు మధ్యాహ్నం 2.30కు కౌన్సెలింగ్ నిర్వహిస్తామని డీపీవో రాంబాబు తెలిపారు.



డీఎంహెచ్‌వో ఆఫీసు వద్ద ధర్నా చేస్తున్న వైద్యులు

డీఎంహెచ్‌వో కార్యాలయం వద్ద పీహెచ్‌సీ వైద్యుల ధర్నా

రాజమహేంద్రవరం రూరల్, సెప్టెంబరు21: తమ న్యాయమైన డిమాండ్లను నేరవేర్చాలని కోరుతూ పీహెచ్‌సీ వైద్యులు శనివారం బొమ్మూరులోని డీఎంహెచ్‌వో కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ వైద్యులు సంఘం అధ్యక్షురాలు డాక్టర్ మౌనిక, కార్యదర్శి డాక్టర్ వినూత్న, కోశాధికారి డాక్టర్ ధర్మరాజు మాట్లాడారు. వైద్యులకు పీజీ కోర్సుల్లో ఇన్‌సర్వీస్ కోటాసీట్లు తగ్గించడాన్ని నిరసిస్తూ నిరసన చేపట్టినట్టు తెలిపారు. జీవోనెంబరు 85ను రద్దుచేసేవరకు ఆందోళన కొనసాగుతుందన్నారు. ఇన్‌సర్వీస్ కోటా కుదింపుతో జిల్లాలో 108 మంది వైద్యులు, రాష్ట్రవ్యాప్తంగా 2,560 మంది వైద్యులు నష్టపోతున్నారని చెప్పారు. ఈనెల 23న నుంచి విజయవాడలోనే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. అనంతరం డిప్యూటీ డీఎం అండ్‌హెచ్‌వో డాక్టర్ ఎస్.సంధ్యకు వినతిపత్రం అందించారు. యూనియన్ సభ్యులు ఏవీకే చైతన్య, సిరాజుద్దీన్, హరిశ్చంద్ర, షమ్మీ పాల్గొన్నారు.

3 నుంచి దేవీచౌక్ శరన్నవరాత్రి మహోత్సవాలు

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 21: రాజమహేంద్రవరం దేవీచౌక్‌లోని బాలత్రిపుర సుందరీదేవి శరన్నవరాత్రి మహోత్సవాలు వచ్చేనెల 3 నుంచి 13వ తేదీవరకు ఘనంగా నిర్వహిస్తున్నట్టు శ్రీదేవి మహోత్సవ సమితి అధ్యక్షుడు బత్తుల రాజరాజేశ్వరరావు తెలిపారు. శనివారం దేవిచౌక్ కల్యాణ మండపంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈఏడాది 91వ నవరాత్రి మహోత్సవాలు నిర్వహించడానికి చురుగ్గా ఏర్పాట్లుచేస్తున్నామన్నారు. 2న రాత్రి 9:09 గంటలకు దేవి విగ్రహప్రతిష్ఠ చేస్తామని 3న ఉదయం 8:40 గంటలకు కలశస్థాపన చేస్తామన్నారు. ప్రతిరోజు కుంకుమ పూజలు, ఉదయం మంగళ వాయిద్యాల నడుమ అఖండ హారతి కార్యక్రమాలు ఉంటాయన్నారు. 6న ఆదివారం 108 మంది దంపతుల పూజ, 9న మూలానక్షత్రం సందర్భంగా సరస్వతి పూజలు ఉంటాయన్నారు. రోజుకొక అలంకరణలో అమ్మవారు దర్శనమిస్తారన్నారు. 3వ తేదీ నుంచి ప్రతిరోజూ రాత్రి నాటక ప్రదర్శనలు ఉంటాయన్నారు.



పోస్టర్‌ను విడుదల చేస్తున్న బత్తుల, ఉత్సవ సమితి సభ్యులు

20న అన్నదానం ఉంటుందన్నారు. అనంతరం కార్యక్రమాలకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సమితి ఉపాధ్యక్షుడు ముత్యాల కుమారరెడ్డి, గంధం భైరవస్వామి, ఆకుల వెంకటేశ్వరరావు, సెక్రటరీ అల్లక సత్యనారాయణ, కోశాధికారి బత్తుల ఈశ్వరరావు, సహాయ కార్యదర్శులు పిల్లా వెంకటేశ్వరరావు, పిల్లి వెంకటరమేష్ పాల్గొన్నారు.



ఏకగ్రీవం చేసి ఐక్యతను చాటుతున్న ఎమ్మెల్యే శ్రీనివాస్

చాంబర్ అధ్యక్షుడిగా తవ్వా రాజా

ఏకగ్రీవం చేసిన ఎమ్మెల్యే ఆదిరెడ్డి

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 21: రాజమహేంద్రవరంలో ప్రతిష్ఠాత్మకంగా జరిగేది రాజమండ్రి చాంబర్ ఆఫ్ కామర్స్ ఎన్నికలను ఈసారి ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ వ్యూహరచనచేసి ఏకగ్రీవం చేశారు. జాంపేట కోఆపరేటివ్ బ్యాంక్ ఎన్నికలను సైతం ఇటీవల ఏకగ్రీవం చేసిన ఆదిరెడ్డి ఇప్పుడు చాంబర్ ఎన్నికలను కూడా ఏకగ్రీవం అయ్యేలా చూశారు. చాంబర్‌కు జరిగే ఎన్నికల్లో పోటీలో ఉన్న అభ్యర్థులకు పోలింగ్ ఈనెల 30న జరగాల్సివుండగా కూటమి నాయకులతో ఏర్పాటు చేసిన తవ్వా రాజా ప్యానల్‌ను ఏకగ్రీవం చేయడంలో అందరినీ ఒకేతాటిపైకి తెచ్చారు. దీంతో కూటమి ప్యానల్‌లో తవ్వా రాజా చాంబర్ అధ్యక్షుడుగాను, రెండు ఉపాధ్యక్ష పదవులకు ఒంటెద్దు సూరిబాబు, ఇయ్యపు మురళీధర్, కార్యదర్శిగా ఆకుల శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శిగా తోట లక్ష్మీనారాయణ (కన్నా), కోశాధికారిగా అల్లంకి నాగేశ్వరరావు (బి10), మరికొంతమంది డైరెక్టర్లుగా ఎన్నికయ్యారు. ఈ క్రమంలో ఈనెల 29న జనరల్ బాడీ సమావేశం నిర్వహించబోతున్నారు. వచ్చే నెల మొదటి వారంలో ప్రమాణస్వీకారం చేసే అవకాశంఉంది.

విషాదాంతాలు

కాకినాడ జిల్లా తుని మండలం ఎర్రకోనేరు వద్ద హైవేపై ఇద్దరు బీబీఏ విద్యార్థులు బుల్లెట్‌పై విశాఖ నుంచి విజయవాడ వెళ్తుండగా వెనుక నుంచి కారు ఢీకొంది. ఈ ఘటనలో నాదెండ్ల నిరంజన్ (19), పోలిశెట్టి రేవంత్ (19) అనే ఇద్దరు విద్యార్థులు మృతి చెందారు. ఓ పరీక్ష కోసం వీరు వెళుతుండగా ఈ దుర్ఘటన జరిగింది. రేవంత్‌ది సొంతూరు భీమవరం. విజయవాడ కేఎల్ వర్సిటీలో చదువుతున్నారు. అలాగే తూర్పుగోదావరి జిల్లా రంగంపేట మండలం వడిశలేరులో బైక్ అదుపుతప్పి పడిపోవడంతో ఓ బీటెక్ విద్యార్థి మృతి చెందగా మరొక విద్యార్థి తీవ్రంగా గాయపడ్డాడు. - లోపలి పేజీల్లో


సమావేశంలో మాట్లాడుతున్న విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులు

తిరుమల లడ్డూ కల్తీ బాధ్యులను శిక్షించాలి
విశ్వహిందూ పరిషత్

నిడదవోలు, సెప్టెంబరు 21: తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారంలో బాధ్యులను కఠినంగా శిక్షించాలని విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. శనివారం నిడదవోలు పట్టణంలోని మదన గోపాలస్వామి ఆలయంలో వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులు మాట్లాడుతూ రాష్ట్రంలోని తిరుపతితో పాటు మిగిలిన దేవాలయాల్లో కూడా ప్రసాదాల కల్తీపై ప్రభుత్వం దర్యాప్తు చేయించాలని అన్నారు. దీనికి బాధ్యులైన వారిని శిక్షించడంతో పాటు హిందువుల మనోభావాలను కాపాడాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎం.సుబ్బారాయుడు, సత్తిబాబు, నీలం రామారావు తదితరులు పాల్గొన్నారు.


అనంతపల్లిలో ఆందోళన చేస్తున్న హిందువులు, భవానీలు

లడ్డూ కల్తీపై సమగ్ర విచారణ జరపాలి

నల్లజర్ల, సెప్టెంబరు 21: తిరుమల లడ్డూ కల్తీకి పాల్పడిన వారిపై విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని అనంతపల్లి టీడీపీ అధ్యక్షుడు, భజన సమాజం అధ్యక్షుడు గురిమిల్లి శ్రీనివాస్, మధవరావు అన్నారు. శనివారం అనంతపల్లి వెంకటేశ్వరరావు ఆలయం వద్ద హిందువులతో పాటు భవానీ మాలధారులు ఆందోళన చేశారు. హిందువుల మనోభావాలను దెబ్బతీసిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. కార్యక్రమంలో ప్రతిపాటి గంగరావు, పిసిని శ్రీను, మీసాల బుచ్చిరాజు తదితరులు పాల్గొన్నారు.


అధికారులు, రైస్ మిల్లర్లతో మాట్లాడుతున్న జేసీ చిన్నరాయుడు

ధాన్యం కొనుగోలు నిర్వహణపై సమీక్ష

తాళ్లపూడి, సెప్టెంబరు 21: రానున్న ఖరీఫ్ సీజన్‌లో రైతులు పండించిన ధాన్యం సేకరణ, కొనుగోలు కేంద్రాల నిర్వహణ తదితర అంశాలపై వివిధ శాఖల అధికారులు, రైస్ మిల్లర్లతో జేసి చిన్న రాయుడు సమీక్షించారు. శనివారం తాళ్లపూడి తహశీల్దార్ కార్యాలయంలో సమన్వయ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో జేసి మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో జిల్లాలో 4 లక్షల 42 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించాలన్న లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. రైతుల సమస్యలతోపాటు రైస్ మిల్లర్ల ఇబ్బందులు తెలుసుకుంటున్నామన్నారు. అనంతరం వ్యవసాయశాఖ జిల్లా అధికారి మాధవరావు మాట్లాడారు. కార్యక్రమంలో డీఎస్‌వో భాస్కర్, డీఎం రాధిక, ఏడిఏ చంద్రశేఖర్, తహశీల్దార్ రవీంద్రనాథ్, ఏవో రుచిత, డీఎస్‌డీటీ దివాకర్, మిల్లర్ల సంఘ అధ్యక్షుడు సింహాద్రి జనార్దనరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం జేసీ మండలంలోని తాడిపూడి గ్రామంలోని ఆర్‌బికేని సందర్శించి ధాన్యం కొనుగోలు విధానాన్ని పరిశీలించారు.

ఎంపికైన విద్యార్థులకు అభినందనలు

దేవరపల్లి, సెప్టెంబరు 21: దేవరపల్లి మండలం యాదవోలు జిల్లా పరిషత్ హైస్కూల్ అండర్-19లో రాష్ట్రస్థాయి క్రికెట్‌కు ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయులు, నాయకులు శనివారం అభినందించారు. యాదవోలు జడ్పీ హైస్కూల్‌లో చదువుతున్న ఏ.జ్యోత్స్న, అనిశెట్టి లావణ్య, ఎన్.దేవిప్రియ, టీ.అనూష, టీ.కేశవర్ధిని, ఎం.సంజన, సీహెచ్.షన్ముక్రప్రియ, ఎంపికైనట్లు ప్రిన్సిపల్ శేషగిరిరావు తెలిపారు. ఎంపికైన విద్యార్థులను టీడీపీ, జనసేన నాయకులు సుదురుమాటి శ్రీనివాస్, అనిశెట్టి శ్రీనివాస్, యర్రగొల్ల అంజిబాబు, కోలా రామకృష్ణ, స్కూల్ ఎస్ఎంసీ చైర్మన్ వల్లూరి వీరపండు, వైస్ చైర్మన్ కంబాల ఉమామహేశ్వరి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

బైక్ అదుపుతప్పి విద్యార్థి మృతి


గాయపడిన ప్రవీణ్‌కుమార్

రంగంపేట, సెప్టెంబరు 21: బైక్ అదుపుతప్పి పడిపోవడంతో ఒకరు మృతి చెందగా మరొకరికి గాయాలయ్యాయని ఎస్ఐ తోట కృష్ణసాయి తెలిపారు. శనివారం ఉదయం 9 గంటల సమయంలో రాజమహేంద్రవరం పరిధి మోరంపూడి గ్రామానికి చెందిన విద్యార్థులు కొప్పిశెట్టి ప్రవీణ్ కుమార్, కేతా మోహన్ వెంకటసాయి(17) బైక్‌పై సూరంపాలెం ఆదిత్య ఇంజనీరింగ్ కాలేజీకి వస్తుండగా రంగంపేట మండలం వడిశలేరు కార్గిల్ ఫ్యాక్టరీ వద్ద ఎదురుగా వస్తున్న కారును తప్పించబోయి అదుపుతప్పి బైక్‌ను ఢీకొని కిందపడిపోవడంతో ఇద్దరికీ తీవ్రగాయాలయ్యాయి. ఆ సమయంలో అటుగా వస్తున్న ఎస్ఐ కృష్ణసాయి వారిని 108 అంబులెన్స్‌లో రాజానగరంలో జీఎస్ఎల్ ఆసుపత్రికి తరలించారు. వెంకటసాయి చికిత్స పొందుతూ మృతిచెందగా, ప్రవీణ్ కుమార్ చికిత్స పొందుతున్నాడని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు. మృతుడు వెంకటసాయి ఇంజనీరింగ్ సెకండియర్ చదువుతున్నాడు.



క్వారీ మార్కెట్ సెంటర్‌లో నిరసన తెలుపుతున్న బీజేపీ ఓబీసీ మోర్చా

రిజర్వేషన్ల వ్యతిరేకి రాహుల్‌గాంధీ
బీజేపీ ఓబీసీ మోర్చా నిరసన

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 21: కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ రిజర్వేషన్ల వ్యతిరేకి అని పలువురు ఓబీసీ మోర్చా, బీజేపీ నాయకులు విమర్శించారు. దేశంలో రిజర్వేషన్లకు వ్యతిరేకంగా రాజీవ్‌గాంధీ అనుచిత వ్యాఖ్యలు చేశారని పేర్కొంటూ శనివారం రాజమహేంద్రవరం క్వారీ మార్కెట్ సెంటర్లోని అంబేద్కర్ విగ్రహం ఎదుట బీజేపీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వాషింగ్టన్ జార్జిటౌన్ విశ్వవిద్యాలయంలోని విద్యార్థులతో రాహుల్‌గాంధీ మాట్లాడుతూ భారత్‌లో రిజర్వేషన్లు రద్దు చేస్తామని చెప్పడంతో కాంగ్రెస్ నిజస్వరూపం బయటపడిందన్నారు. విదేశాలకు వెళ్లిన ప్రతిసారీ భారత ప్రతిష్ఠ దిగజార్చేలా ఆయన మాట్లాడుతున్నారని విమర్శించారు. కార్యక్రమంలో బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు సోము వీర్రాజు, జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు సత్యసాయిరాం, కురగంటి సతీష్, వీరా వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న గణనాథుడి ఊరేగింపు

దేవరపల్లి, సెప్టెంబరు 21: దేవరపల్లి మెరకవీధి వినాయకుడి గుడి వద్ద శనివారం గణపతి నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా భారీ ఊరేగింపు నిర్వహించారు. వినాయకుడిని ప్రత్యేక వాహనంపై ఊరేగించారు. ఈ సందర్భంగా బ్యాండు వాయిద్యాలు, విచిత్ర వేషాలు, బాణసంచాలతో ఊరేగింపు సాగింది. సాయంత్రం నిమజ్జనం నిర్వహించగా, ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ట్యాంక్ మరమ్మతుకు చర్యలు

చాగల్లు, సెప్టెంబరు 21: చాగల్లు సెంటర్‌లోని పెద్ద వాటర్ ట్యాంక్‌కు మరమ్మతులు నిర్వహిస్తున్నట్టు పంచాయతీ కార్యదర్శి ఎల్.రవికుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ట్యాంకు పరిధిలోని వారికి పైప్‌లైన్‌ల ద్వారా నీటి సరఫరా జరుగుతుందన్నారు. ఎంపీడీవో ఆఫీసు రోడ్డు, కారుమూరివారి వీధి, కొత్తపేట, జుట్టు వారి వీధి, ఆళ్ల హరిబాబు ఇంటి ప్రక్కల వీధులు, లింగాల శ్రీను వీధి, కొఠారు మునేశ్వరరావు వీధి, జుజ్జవరపు రామచంద్రరావు వీధి, మెయిన్‌రోడ్డు రోడ్డు నుంచి నాలుగు బొమ్మల వీధి, కోనేరు వీధి, బృందావనం, చేపలవారి వీధి తదితర ప్రజలు వాటర్ ట్యాంక్ సమస్యను అర్థం చేసుకుని సిబ్బందికి సహకరించాలని కోరారు.

కూటమి ప్రభుత్వంతో రాష్ట్రానికి మంచిరోజులు


కొవ్వూరు మండలం ఆరికిరేవుల గ్రామంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

'మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో ఎమ్మెల్యే ముప్పిడి
సమస్యలు పరిష్కరిస్తామని ప్రజలకు హామీ

కొవ్వూరు, సెప్టెంబర్ 21: కూటమి ప్రభుత్వంలో రాష్ట్రానికి మంచిరోజులు వచ్చాయని కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. కొవ్వూరు మండలం ఆరికిరేవుల, కుమారదేవం గ్రామాల్లో శనివారం మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వంద రోజుల పాలనలో భాగంగా ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమన్నారు. వంద రోజుల ప్రభుత్వపాలనను తెలుపుతూ కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మట్టా శ్రీనివాస్, చావా శ్రీనివాస్, వట్టికూటి వెంకటేశ్వరరావు తదితరులతో పాటు మండల ప్రత్యేక అధికారి సుభాషిణి, ఎంపీడీవో కె.సుశీల తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి అధిక ప్రాధాన్యం

దేవరపల్లి, సెప్టెంబరు 21: వంద రోజుల పాలనలో అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేసిందని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. దేవరపల్లి మండలం పల్లంట్లలో శనివారం టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు కొయ్యలమూడి చినబాబు ఇంటి వద్ద మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. గోపాలపురం నియోజకవర్గంలో రూ.21 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. నియోజకవర్గంలో రూ.800 కోట్లతో ఒక సంస్థ పరిశ్రమ ఏర్పాటు చేయడానికి ముందుకొచ్చిందన్నారు. వైసీపీ పాలనలో హిందువుల మనోభావాలు దెబ్బతీసే విధంగా తిరుమల లడ్డూలో కల్తీనెయ్యికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని ఎమ్మెల్యే మదిపాటి డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొయ్యలమూడి చినబాబు, కొయ్యలమూడి సుధారాణి, టీడీపీ మండల అధ్యక్షుడు ఆండ్రూ అనీల్, టీడీపీ నాయకులు గన్నమని హరికృష్ణ, సుంకర దుర్గారావు తదితరులతో పాటు తహసీల్దార్ కే.రాజ్యలక్ష్మి, ఎంపీడీవో ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమానికి పెద్దపీట

నిడదవోలు, సెప్టెంబరు 21: కూటమి ప్రభుత్వం ప్రజా ప్రభుత్వమని బీజేపీ పట్టణ అధ్యక్షుడు నీలం రామారావు అన్నారు. శనివారం నిడదవోలు పట్టణంలోని వీక్లీ మార్కెట్ సచివాలయం పరిధిలో మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ పట్టణ అధ్యక్షుడు నీలం రామారావు మాట్లాడుతూ అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. కార్యక్రమంలో తిరుపతి సత్యనారాయణ, గోవా కృష్ణ తదితరులు పాల్గొన్నారు. మండలంలోని ఉనకరమిల్లి గ్రామంలో జనసేనపార్టీ ఆధ్వర్యంలో ఇంటింటా మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పోలిరెడ్డి వెంకటరత్నం, పాలా వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

కూటమి నాయకుల ఇంటింటి ప్రచారం

తాళ్లపూడి, సెప్టెంబరు 21: మండల కేంద్రమైన తాళ్లపూడిలో వంద రోజుల ఎన్డీయే పాలనలో భాగంగా శనివారం టీడీపీ మండల అధ్యక్షుడు నామన పరమేశ్వరరావు ఆధ్వర్యంలో సచివాలయ సిబ్బంది, కూటమి నాయకులు ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు అందించారు. మండలంలోని తాడిపూడి గ్రామంలో నామా కొండబాబు ఆధ్వర్యంలో కూటమి నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటింటి ప్రచారంలో కూటమి కార్యకర్తలు

పెరవలి, సెప్టెంబరు 21: కొత్తపల్లిలో మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా తెలుగుదేశం, జనసేన, బీజేపీ కార్యకర్తలు ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం ఏర్పడిన వంద రోజుల్లో చేసిన అభివృద్ధిని, ఇచ్చిన హామీలను నెరవేర్చామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బండారు వెంకట రమణ, సాయి బాబా, బర్రే దొరసామి, కేతా రామ్ పండు, బండారు బాబ్జి, కేతా పల్లయ్య, పంచాయతీ సెక్రటరీ నాగిణి పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శి సహకరించడం లేదు : కానూరు అగ్రహారంలో మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించడానికి పంచాయతీ కార్యదర్శి నల్లగొండ దుర్గ సహకరించడం లేదని ఆ గ్రామ టీడీపీ నాయకులు ఆరోపించారు. టీడీపీ గ్రామ నాయకులు శనివారం ఉదయం 11 గంటలకు పంచాయతీ కార్యాలయానికి వెళ్లినప్పటికీ పంచాయతీ కార్యదర్శి రాలేదన్నారు. కొద్దిసేపటి తర్వాత వచ్చిన ఆమె నాయకుల పట్ల దురుసుగా వ్యవహరించారని ఆరోపించారు. దీనిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని టీడీపీ గ్రామ నాయకుడు హనుమంతు సుబ్రహ్మణ్యం డిమాండ్ చేశారు.


పల్లంట్లలో మంచి ప్రభుత్వం ప్లకార్డులు చూపుతున్న ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు, అధికారులు, టీడీపీ నేతలు

ప్రచారంలో కరపత్రాల పంపిణీ

చాగల్లు, సెప్టెంబరు 21: ఎన్‌డీఏ ప్రభుత్వం వంద రోజులు పూర్తయిన నేపథ్యంలో ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. చాగల్లులోని పలు వీధుల్లో కూటమి నాయకులు అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. టీడీపీ నాయకులు కరుటూరి సతీష్, కేతా సాహెబ్, కోడి చంటియ్య తదితరులు పాల్గొన్నారు. ఇస్లామ్‌పేటలో అల్తాఫ్ అహ్మద్ ప్రచారంలో పాల్గొన్నారు. దారవరంలో బొడ్డు రాజు, కేశవకుమార్‌ల ఆధ్వర్యంలో మంచి ప్రభుత్వం కార్యక్రమంలో కేశవ, పాలకుర్తి శ్రీనివాస్ తదితరులు ఇంటింటి ప్రచారం చేశారు. నందిగంపాడులో రావిపాటి కామేశ్వరరావు, ఊనగట్లలో బొల్లిన శివనాగేంద్ర, మనెల్లి నాని ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం చేశారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

నేడు నెలటూరు, మల్లవరంలో ఎమ్మెల్యే పర్యటన: మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు నెలటూరు, మల్లవరంలో కార్యక్రమాల్లో పాల్గొంటారని టీడీపీ నాయకులు ఆళ్ళ హరిబాబు, నాదెళ్ళ శ్రీరామ్‌లు తెలిపారు.


చాగల్లులో ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వ విజయాలు తెలియజేస్తున్న నాయకులు

కొనసాగుతున్న పోలీసు పికెటింగ్

కొవ్వూరు, సెప్టెంబర్ 21: పట్టణంలోని రాజీవ్‌కాలని, శ్రీరామకాలనీలలో మూడవరోజు పోలీసు పికెటింగ్ కొనసాగింది. కొవ్వూరు పట్టణంలోని రాజీవ్‌కాలనీలో గణపతి నవరాత్రులను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహం నిమజ్జన ఊరేగింపు ఈ నెల 19న రాత్రి ప్రారంభమైంది. ఈ ఊరేగింపు శ్రీరామకాలనీలోకి చేరుకునే సమయంలో పలువురు ఆకతాయిలు రాళ్ళు రువ్వడంతో ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి. దీంతో జిల్లా ఎస్పీ బి.నరసింహకిశోర్ ఆధ్వర్యంలో పోలీసు బలగాలు శ్రీరామకాలని, రాజీవ్‌కాలనీల్లో పోలీసు పికెటింగ్‌లు పెట్టి రాకపోకలను మూసివేశారు. ఆకతాయిలు చేసిన పనివల్ల రెండు కాలనీలు, రెండు సామాజిక వర్గాల మధ్య గొడవగా మారింది. ఈ ఘర్షణపై పట్టణ పోలీస్‌స్టేషన్‌ల్లో కేసులు నమోదు చేశారు. రెండు కాలనీల్లో శాంతిభద్రతలు సాధారణ స్థితికి చేరుకునేలా పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు. శనివారం కొవ్వూరు పట్టణ సీఐ రాజీవ్‌కాలనీలో మత్స్యకారులతో సమావేశం జరిపారు. మరోవైపు ఇతర ప్రాంతాల నుంచి పలువురు దళిత నాయకులు వచ్చి పోలీసులతో సంప్రదింపులు జరుపుతున్నారు.


రాజీవ్‌కాలని బ్రిడ్జి కింద పికెటింగ్ నిర్వహిస్తున్న పోలీసులు

క్రీడలకు అధిక ప్రాధాన్యం

దేవరపల్లి, సెప్టెంబరు 21: క్రీడా రంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తామని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. శనివారం దేవరపల్లి మండలం పల్లంట్లలో జిల్లాస్థాయి ఫుట్‌బాల్ అండర్-14, 17 బాలబాలికలకు పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు మాట్లాడుతూ గోపాలపురం నియోజకవర్గాన్ని క్రీడల్లో ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామన్నారు. పల్లంట్ల హైస్కూల్ ప్రహరీ నిర్మాణానికి అదనపు స్థల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామన్నారు. ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజును పీఈటీలు, గ్రామస్థులు సత్కరించారు. ఫుట్‌బాల్ పోటీలకు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాల్లోని 25 పాఠశాలల నుంచి అండర్-14, 17 విభాగాల్లో 400 మంది బాలికలు పాల్గొనగా ఇందులో 72 మందిని సెలక్ట్ చేసి సెలక్ట్ అయిన వారు రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొంటారని పీడీ ఓరుగంటి రామకృష్ణంరాజు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొయ్యలమూడి చినబాబు, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మహిళా అధికార ప్రతినిధి కొయ్యలమూడి సుధారాణి, టీడీపీ నాయకులు కూచిపూడి చక్రవర్తి, ఎన్‌సీఎఫ్ జిల్లా కార్యదర్శి మల్లేశ్వరరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ గన్నమని జనార్ధనరావు, సర్పంచ్ నూతలపాటి వెంకటరమణ, టీడీపీ మండల అధ్యక్షుడు ఆండ్రూ అనీల్, టీడీపీ నాయకులు గన్నమని హరికృష్ణ, సుంకర దుర్గారావు, అనిశెట్టి ప్రభాకరరావు, చింతాల దాసు తదితరులు పాల్గొన్నారు.


పల్లంట్లలో క్రీడలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు

పౌష్టికాహారంతో తల్లీ,బిడ్డ క్షేమం

దేవరపల్లి, సెప్టెంబరు 21: తల్లి, బిడ్డ ఆరోగ్యంగా ఉండాలంటే పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి అన్నారు. దేవరపల్లిలో పౌష్టికాహారం, స్వచ్ఛత హి సేవ, బాల్య వివాహాల నిర్మూలనపై శనివారం ర్యాలీ నిర్వహించారు. తల్లి, బిడ్డ క్షేమంగా ఉండాలంటే పౌష్టికాహారం తప్పక తీసుకోవాలన్నారు. బాల్య వివాహాలు చేసినా లేక సహకరించిన వారిపై కఠిన చర్యలుంటాయన్నారు. ఎంఈవో ఎం.తిరుమల దాసు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, డ్వాక్రా మహిళలు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన

చాగల్లు, సెప్టెంబరు 21: గర్భిణీలు, బాలింతలు తీసుకొనే ఆహారంపై అవగాహన ఉన్నప్పుడే వారు ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి అన్నారు. చాగల్లులో పలు అంగన్‌వాడి కేంద్రాల్లో శనివారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడి కార్యకర్తలు సౌధామణి, సుశీల, నీలిమ, పి.విజయకుమారి, వెంకటలక్ష్మి, గంగాభవాని తదితరులు పాల్గొన్నారు.


చాగల్లులో పౌష్టికాహారంపై అవగాహనలో పాల్గొన్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి తదితరులు

పోషకాహారంతో రక్తహీనత దూరం

కొవ్వూరు, సెప్టెంబర్ 21: పోషకాహారంతో కిశోర బాలికలు, గర్భిణీలలో రక్తహీనత నివారించవచ్చునని కొవ్వూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో డి.మమ్మీ అన్నారు. శుక్రవారం కొవ్వూరు పట్టణంలోని 5, 6, 7, 8, 9, 10 వార్డులలో అంగన్వాడీ సూపర్‌వైజర్ ఆర్.విజయలక్ష్మి ఆధ్వర్యంలో పౌష్టికాహార వారోత్సవాలను నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి ముఖ్య అతిథిగా పాల్గొని గర్భిణీలకు సీమంతాలు జరిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మద్దిపట్ల సాయిగీత, అంగన్‌వాడీలు ఆర్ఎస్ఎన్ సుజాత, వి.కోమల తదితరులు పాల్గొన్నారు.

కొవ్వూరు మండలం చిడిపి, పశివేదల గ్రామాలలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కె.వి.పద్మావతి, జి.ఆదిలక్ష్మిల ఆధ్వర్యంలో పోషకాహార వారోత్సవాలను నిర్వహించారు. సర్పంచ్‌లు పాలడుగుల లక్ష్మణరావు, తుంపల్లి సింహాచలం ముఖ్య అతిథులుగా పాల్గొని మహిళలు, గర్భిణీలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించి పౌష్టికాహారం ఉపయోగాలు తెలియజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు రామకృష్ణ, పీ.ఎస్.భూపతి, నాయకులు బేతిన నారాయణ, తుంపల్లి ఆదినారాయణ, గారపాటి రామచంద్రరావు, ఎంపీటీసీ కె.బాలకృష్ణ, అనపర్తి రవిచంద్ర, మాసాబత్తుల రామకృష్ణ, లిఖిత, సింధూ, ఎం.వెంకటలక్ష్మి, కె. నానెమ్మ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

కొవ్వూరు, సెప్టెంబర్ 22: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని కొవ్వూరు ఆర్టీసి డిపో మేనేజర్ వై.వి.వి.ఎన్. కుమార్ అన్నారు. స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా శనివారం కొవ్వూరు ఆర్టీసి బస్టాండ్ ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని చేపట్టారు. బస్టాండ్ పరిసరాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు రాజు, నేషనల్ మజ్దూర్ యూనియన్ నాయకులు రాజు, ట్రాఫిక్ సూపర్‌వైజర్ కుమారి, పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.

చిడిపి గ్రామంలో....

కొవ్వూరు మండలం చిడిపి గ్రామంలో సర్పంచ్ పాలడుగుల లక్ష్మణరావు ఆధ్వర్యంలో స్వచ్ఛత హి సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అనపర్తి రవిచంద్ర, మాసాబత్తుల రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ, లిఖిత, సింధూ, తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం

కొవ్వూరు, సెప్టెంబర్ 21: గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహాన్ని పట్టణ పోలీసులు గుర్తించారు. తాళ్లపూడి ఏటిగట్టు రోడ్డులో కొవ్వూరు మున్సిపాల్టీ మెయిన్ వాటర్‌వర్క్స్ స్థలంలో గుర్తు తెలియని మృతదేహం ఉందన్న సమాచారం రావడంతో పట్టణ ఏఎస్ఐ జి.జి.ప్రకాష్ సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతుడి ముఖం గుర్తు పట్టడానికి వీల్లేకుండా ఉందని, వయసు 60 ఏళ్లు ఉంటుందన్నారు. అక్కడ దొరికిన సెల్‌ఫోన్ ఆధారంగా చిడిపి గ్రామానికి చెందిన హనుమంతుగా గుర్తించారు. చిడిపి గ్రామానికి చెందిన కట్టా శ్రీనివాస్ వద్ద పనిలో చేరగా, శనివారం పోలీసులు ఫోన్ చేయడంతో మృతుడు హనుమంతుగా గుర్తించారు. పూర్తి వివరాలు తనకు తెలియదన్నారు. ఈ మేరకు శ్రీనివాస్ అందించిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ ప్రకాష్ తెలిపారు.

గాయపర్చిన యువకులపై కేసు నమోదు

కొవ్వూరు, సెప్టెంబర్ 21: ఇద్దరు యువకులను గాయపర్చిన వారిపై కేసు నమోదు చేసినట్లు కొవ్వూరు పట్టణ ఎస్ఐ కె.జగన్మోహనరావు తెలిపారు. పట్టణంలోని రాజీవ్‌కాలనీకి చెందిన మల్లె చిన్న, శివ ఈ నెల 20న మధ్యాహ్నం పెట్రోల్ బంక్‌కు వెళ్లారు. అదే సమయంలో తునిపేటకు చెందిన 10 మంది యువకులు బంకు వద్ద వినాయకుని ఊరేగింపు గొడవలను పురస్కరించుకుని కర్రలతో గాయపర్చారు. దీనిపై చిన్న తన మామ రాజుకు ఫోన్‌లో చెప్పడంతో అక్కడికి చేరుకున్నారు. వారిద్దరిని కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం రాజమహేంద్రవరం రిఫర్ చేశారు. ఆసుపత్రి సమాచారం మేరకు చిన్న అందించిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కె.జగన్మోహనరావు తెలిపారు.

రీసర్వే సక్రమంగా జరగలేదని రైతుల ఆరోపణ

దేవరపల్లి, సెప్టెంబరు 21: వైసీపీ ప్రభుత్వంలో భూహక్కు రీసర్వే సక్రమంగా జరగలేదని పలువురు రైతులు ఆరోపించారు. శనివారం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజుకు కురుకూరు రైతులు కొయ్యలమూడి అచ్యుత రాయుడు, మల్లేల వెంకటేశ్వరరావు, కొయ్యలమూడి శ్రీనివాస్, కలగర శ్రీనివాస్, యలమాటి భాస్కరరావు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. దీంతో అక్కడే ఉన్న తహసీల్దార్ కే.రాజ్యలక్ష్మిని వారి సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ వ్యవహారంలో ఉన్నతాధికారులతో మాట్లాడి రైతుల సమస్యలు పరిష్కరిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

విద్యార్థులతో శాంతి ప్రతిజ్ఞ

కొవ్వూరు, సెప్టెంబర్ 21: కొవ్వూరు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మద్దిపాటి సత్యనారాయణ ఆధ్వర్యంలో ప్రపంచ శాంతి దినోత్సవాన్ని నిర్వహించారు. శనివారం డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ పాఠశాలలో విద్యార్థులతో శాంతి ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా మద్దిపాటి సత్యనారాయణ మాట్లాడారు. కార్యక్రమంలో క్లబ్ ఉపాధ్యక్షుడు ఎండి హుస్సేన్, సభ్యులు పాల్గొన్నారు.

స్కూల్ గేమ్స్ ఎంపికలు

తాళ్లపూడి, సెప్టెంబరు 21: మండలస్థాయిలో స్కూల్‌గేమ్స్ ఎంపికలు శనివారం మలకపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగాయి. అండర్ 14, 17 బాల బాలికలకు ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, యోగా, షటిల్ బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్‌లో మండలంలో ఎనిమిది పాఠశాలల నుంచి సుమారు 400 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ప్రతిభ కనపరిచిన క్రీడాకారులను జిల్లాస్థాయికి ఎంపిక చేశారు. గెలుపొందిన క్రీడాకారులు త్వరలో జిల్లాస్థాయి ఎంపిక పోటీల్లో పాల్గొంటారని క్రీడోపాధ్యాయులు తెలిపారు. ఈ ఆటల పోటీలను సర్పంచ్ రాపాక రాజేశ్వరి ప్రారంభించగా కూటమి నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


ఆటల పోటీలను ప్రారంభిస్తున్న సర్పంచ్ రాపాక రాజేశ్వరి

ముగిసిన పొగాకు కొనుగోళ్లు


మాట్లాడుతున్న ఆర్ఎం జీఎల్‌కే ప్రసాద్

గోపాలపురం, సెప్టెంబరు 21: వర్జీనియ పొగాకు పండించే రైతును బోర్డు అనుమతించిన మేరకే పంటలు పండించాలని ఆర్ఎం జీఎల్‌కే.ప్రసాద్ అన్నారు. స్థానిక పొగాకు వేలం కేంద్రంలో శనివారంతో పొగాకు కొనుగోళ్ళు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా బోర్డు పరిధిలోని రైతులు, కంపెనీ ప్రతినిధులు, అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ఎం జీఎల్‌కే.ప్రసాద్ మాట్లాడుతూ ఈ ఏడాది పొగాకు కొనుగోలు ప్రారంభం నుంచి ముగింపు వరకు వేలం నిర్వహణ సక్రమంగా జరిగిందన్నారు. రైతులు ఆశించిన స్థాయిలో ధరలు పలకటంతో పొగాకు రైతులు ఆనందంగా ఉన్నారన్నారు. గోపాలపురం వేలం కేంద్రంలో 156 రోజులు 387 కోట్ల విలువ చేసే 11.82 మిలియన్ పొగాకును కొనుగోలు చేశామన్నారు. అనంతరం వేలం నిర్వహణాధికారి అమల్త్రిశ్యామ్‌ను కంపెనీ ప్రతినిధులు, రైతు సంఘం నాయకులు సత్కరించారు. కార్యక్రమంలో పొగాకు బోర్డు మాజీ వైస్ చైర్మన్ గద్దే శేషగిరిరావు, రైతు సంఘం అధ్యక్ష కార్యదర్శులు రాంబాబు, గౌరవ అధ్యక్షుడు పిన్నమనేని మధుమోహన్, ఉండవల్లి సత్యనారాయణ, నందమూరి సత్యనారాయణ, గడా భాస్కరరావు, ముల్లంగి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముంపు బాధితులకు జనసేన అండ

గోపాలపురం, సెప్టెంబరు 21: ముంపు బాధితులకు జనసేన అండగా ఉంటుందని గోపాలపురం ఇన్‌ఛార్జ్ దొడ్డిగర్ల సువర్ణరాజు అన్నారు. ఈ సందర్భంగా వేలచింతల గూడెంలో కార్యకర్తలు సేకరించిన 700 కిలోల బియ్యాన్ని జనసైనికులు ఇన్‌ఛార్జ్ సువర్ణరాజుకు శనివారం దేవరపల్లి కార్యాలయంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు జనసైనికులు పాల్గొన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంటే ఆరోగ్యం పదిలం

దేవరపల్లి, సెప్టెంబరు 21: దేవరపల్లి పొగాకు వేలం కేంద్రం ప్రాంగణంలో శనివారం క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం చేపట్టారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే మన ఆరోగ్యం బాగుంటుందని ప్రతీ ఒక్కరు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని పొగాకు వేలం నిర్వహణాధికారి హేమస్మిత అన్నారు. కార్యక్రమంలో పొగాకు బోర్డు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సినిమా గైడ్

కొవ్వూరు

యువరాజ్‌మాల్ స్క్రీన్ 1	సరిపోదా శనివారం
వై.స్క్రీన్2	డిమోంటి
దేవిశ్రీ(గాయత్రి	డబుల్ ఇస్మార్ట్
అనన్య	ఆయ్

నిడదవోలు

వీ మ్యాక్స్	మత్తు వదలరా 2
రాధాకృష్ణ	ది గోట్
శ్రీగణపతి	ఆయ్, కమిటీ కుర్రోళ్లు

దేవరపల్లి

శ్రీరామ్‌నాథ్ సినీ మ్యాక్స్	మిస్టర్ బచ్చన్
త్రినాథ్ సినీ మ్యాక్స్	డబుల్ ఇస్మార్ట్